


30న సీఎం చంద్రబాబు పాడేరు రాక?



పాడేరు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈ నెల 30న అల్లూరి జిల్లా కేంద్రం పాడేరు వస్తారని తెలిసింది. జూలై నెల సామాజిక పెన్షన్ల పంపిణీ ప్రక్రియను ఆయన ఇక్కడే లాంఛనంగా ప్రారంభిస్తారని, గిరిజనులతో బహిరంగ సభ నిర్వహిస్తారని సమాచారం. అయితే ముఖ్యమంత్రి పర్యటనను అధికారులు అధికారికంగా ధ్రువీకరించలేదు.

ఐటీ కంపెనీల దాగుడుమూతలు

సంస్థలు వచ్చేదెన్నడో, ఉద్యోగాలు ఇచ్చేదెన్నడో?

- ఇటీవల టీసీఎస్, కాగ్నిజెంట్‌కు భూముల కేటాయింపు
- గతంలోనూ అనేక కంపెనీలకు భూములు
- అనేక సంస్థలు కార్యకలాపాలు ప్రారంభించకుండానే దశాబ్దాలుగా కాలక్షేపం
- నెరవేరని పాలకుల లక్ష్యం
- నిర్దేశిత గడువులోగా ఉపాధి కల్పనకు ఒత్తిడి తేవలసిందే



నగర నడిబొడ్డున ఉన్న విప్రో భవనం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖపట్నంలో ఐటీ రంగం పరిస్థితి విచిత్రంగా ఉంది. ఉద్యోగాలు కల్పిస్తాం అంటూ ముందుకువస్తున్న సంస్థలు ప్రభుత్వం నుంచి భూములు దక్కించుకున్న తరువాత అడ్రస్ ఉండడం లేదు. అలా తీసుకున్న భూముల్లో కనీసం భవనాలు కూడా నిర్మించని సంస్థలు ఎన్నో ఉన్నాయి. మరికొన్ని సంస్థలు అందమైన భారీ భవనాలు నిర్మించి, ఆపరేషన్లు ప్రారంభించకుండా ఖాళీగా ఉంచుతున్నాయి. హామీ ఇచ్చిన మేరకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం లేదు. గత పదిహేనేళ్లుగా విశాఖపట్నంలో ఇదే జరుగుతోంది. దీనికి అనేక ఉదాహరణలు ఉన్నాయి.

నగర నడిబొడ్డున విప్రో సంస్థకు 2006లో ఏడు ఎకరాలు ఇచ్చారు. అందులో నాలుగు ఎకరాల్లోనే భవనం నిర్మించారు. మరో మూడు ఎకరాలు ఖాళీగా ఉంది. ఆరు వేల మందికి ఉపాధి కల్పిస్తామని విప్రో హామీ ఇచ్చింది. భారీ భవనాన్ని ఏళ్ల తరబడి ఖాళీగా ఉంచారు. ఆమధ్య మరో సంస్థకు అందులో కొన్ని అంతస్థులు అద్దెకు ఇవ్వగా, వారు రెండేళ్లు ఉండి ఖాళీ చేసి వెళ్లిపోయారు. ఇప్పుడు ఆరు అంతస్థుల భవనంలో కేవలం వంద మంది మాత్రమే ఉన్నారు. ఆ భూమి విలువ ప్రస్తుత మార్కెట్ ధరల ప్రకారం రూ.700 కోట్లుపైనే. ప్రభుత్వం తరపున ఒక్కరు కూడా ఆ సంస్థను పిలిచి ఎందుకు ఉద్యోగాలు ఇవ్వడం లేదని ప్రశ్నించడం లేదు. ఎదురుగా సత్యం కంపెనీకి భూమి ఇవ్వగా ఆ సంస్థ దివాలా తీయడంతో టెక్ మహీంద్ర టేకోవర్ చేసి నడుపుతోంది.

ఇక రుషికొండ ఐటీ పార్కులో భూములు తీసుకున్న కంపెనీల్లో కేవలం పది మాత్రమే పూర్తిస్థాయిలో ఆపరేషన్లు నిర్వహిస్తున్నాయి. మిగిలిన సంస్థలన్నీ పేరుకు కంపెనీ నడుపుతున్నట్టు నటిస్తున్నాయి. కొన్ని అద్దెకు ఇచ్చుకున్నాయి. మరికొన్ని భవనాలు నిర్మించి కనీసం ప్రారంభోత్సవం కూడా చేయకుండా వదిలేశాయి.

నాలుగేళ్ల తరువాతా!?

ఐటీ కంపెనీలకు కూటమి ప్రభుత్వం ఎకరా భూమి 99 పైసలకే ఇస్తోంది. పేరొందిన పెద్ద సంస్థలు విశాఖపట్నం వంటి ద్వితీయ శ్రేణి నగరానికి రావాలంటే రాయితీలు ఇవ్వాల్సిందే. కాకపోతే వారితో కనీసం రెండేళ్లలో ఆపరేషన్లు ప్రారంభించేలా చేయగలిగినప్పుడే దానికి సార్థకత చేకూరుతుంది. అంతే తప్ప ఇప్పుడు భూములు తీసుకొని నాలుగేళ్ల తరువాత ఉద్యోగాలు ఇస్తామంటే అప్పుడు పరిస్థితులు ఎలా ఉంటాయో చెప్పలేం.

అదానీ పనులు ప్రారంభమే కాలేదు

గతంలో తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు (2014-19) డేటా సెంటర్ కోసం అదానీ కంపెనీ భూమి తీసుకుంది. వైసీపీ ప్రభుత్వంలో దానిని రద్దు చేసి మధురవాడలో హిల్ నంబరు-4లో 130 ఎకరాలు ఒకసారి, మరోసారి 70 ఎకరాలు కేటాయించింది. అందులో రూ.22 వేల కోట్లు పెట్టుబడి పెట్టి, 25 వేల మందికి ఏడేళ్లలో ఉపాధి కల్పిస్తామని హామీ ఇచ్చింది. దీనికి 2023 మే నెలలో అప్పటి సీఎం జగన్ శంకుస్థాపన చేశారు. రెండేళ్లు పూర్తయింది. వంద గజాల నిర్మాణం కూడా అక్కడ జరగలేదు. ఇక మిగిలింది ఐదేళ్లే. ఆలోగా 25 వేల మందికి ఉద్యోగాలు ఇవ్వాలి. కానీ అదానీని ప్రశ్నించే ధైర్యం ఎవరికీ లేదు. అక్కడ ఎకరా రూ.20 కోట్లు విలువ ఉండగా, కోటి రూపాయలకు ఇచ్చారు. పెద్ద కంపెనీలు తక్కువ ధరకు భూములు తీసుకొని పనులే ప్రారంభించడం లేదు. ఆర్భాటమైన ప్రకటనలే మిగులుతున్నాయి.

టీసీఎస్ ఆపరేషన్లు ఎప్పుడు?

ఐటీ మంత్రి లోకేశ్ చేసిన అనేక ప్రయత్నాల మీదట టీసీఎస్ కంపెనీ విశాఖపట్నం రావడానికి అంగీకరించింది. రుషికొండ ఐటీ పార్కులోనే వారికి 21.6 ఎకరాలు కేటాయించారు. వెంటనే కార్యకలాపాలు ప్రారంభించడానికి అదే ఐటీ పార్కులో మిలీనియం టవర్-బిని పూర్తిగా కేటాయించారు. వారి కోసం ఆ భవనానికి ఆర్థిక మండలి నుంచి మినహాయింపు కూడా ఇచ్చారు. మూడు నెలల్లో టీసీఎస్ ప్రారంభం అవుతుందని చెప్పి ఆరు నెలలైంది. ఇప్పటికీ అక్కడ సందడి లేదు. తాజాగా కాగ్నిజెంట్ కంపెనీకి 21.8 ఎకరాలు కాపులుప్పాడలో ఇచ్చారు. ఆ సంస్థ 2029 మార్చి నాటికి కార్యకలాపాలు ప్రారంభిస్తామని ప్రకటించింది. అంటే దాదాపుగా నాలుగేళ్ల

... మిగతా 6వ పేజీలో

గుర్రపు స్వారీకి 3 కోట్లు ధారాదత్తం!

జీవీఎంసీలో గత పాలకుల ఇష్టారాజ్యం

- ప్రజాధనం దుర్వినియోగం
- కౌన్సిల్ అనుమతి లేకుండానే ముడసర్లోవ పార్కులో రూ.ఆరు కోట్లతో ప్రాజెక్టుకు శ్రీకారం
- అంతమొత్తం వెచ్చించడంపై విమర్శలు
- కూటమి ప్రభుత్వం రాగానే నిలిపివేత
- అప్పటికే కాంట్రాక్టర్‌కు రూ.3 కోట్లు చెల్లింపులు
- ఆ డబ్బును రికవరీ చేయాలనే డిమాండ్



ముడసర్లోవ వద్ద గుర్రపు స్వారీ ప్రాజెక్టు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

జీవీఎంసీ గత పాలకులు తమ వ్యక్తిగత ప్రయోజనం కోసం కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారు. కౌన్సిల్ ఆమోదం లేకుండా ముడసర్లోవ వద్ద రూ.6 కోట్ల వ్యయంతో గుర్రపు స్వారీ ప్రాజెక్టు నిర్మాణానికి అనుమతి ఇచ్చారు. అంతమొత్తం వెచ్చించడంపై అప్పట్లోనే విమర్శలు వచ్చాయి. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం ఏర్పడగానే ప్రాజెక్టును నిలిపివేసింది. అయితే అప్పటికే కాంట్రాక్టర్‌కు రూ.3 కోట్లు చెల్లించేసినట్టు బయటపడింది. ఆ మొత్తాన్ని ఇపుడు ఎవరి నుంచి రికవరీ చేస్తారనే చర్చ నడుస్తోంది.

నగరాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేయాలంటే పాశ్చాత్య దేశాల్లో మాదిరిగా గుర్రపు స్వారీని కూడా అందుబాటులో ఉంచాలని జీవీఎంసీ గత కమిషనర్ పి.సాయికాంత్‌వర్మ భావించారు. అందుకోసం ముడసర్లోవ పార్కు వద్ద కొంత స్థలాన్ని కేటాయించారు. దీనికి కౌన్సిల్ నుంచి అనుమతి తీసుకోకుండా రూ.ఆరు కోట్ల వ్యయంతో ప్రాజెక్టు నిర్మాణ బాధ్యతలను ఒక కాంట్రాక్టర్‌కు అప్పగించేశారు. పార్కులో కాంక్రీట్ పనులు చేపట్టడంతో కొందరు పర్యావరణవేత్తలు రాష్ట్ర ప్రభుత్వానికి ఫిర్యాదు చేశారు. దాంతో అసలు ఆ ప్రాజెక్టుకు ఎవరు అనుమతి ఇచ్చారనే ప్రశ్నలు తలెత్తాయి. కౌన్సిల్ సమావేశంలో సభ్యులు దీనిపై నిలదీయడంతో అప్పటి కమిషనర్ సాయికాంత్‌వర్మ ప్రాజెక్టు ఎంతో మంచిదని, దీనివల్ల పర్యాటకాభివద్ధి జరుగుతుందని వివరించారు. అసలు కౌన్సిల్ అనుమతి లేకుండా ఎలా పనులు ప్రారంభిస్తారని సభ్యులు నిలదీయడంతో మేయర్ ముందస్తు అనుమతి ఇచ్చారంటూ సమాధానం చెప్పారు. అయితే తాను గుర్రపుస్వారీ ప్రాజెక్టుకు అనుమతి ఇవ్వలేదని అప్పటి మేయర్ గొలగాని హరివెంకటకుమారి వివరణ ఇచ్చారు. ఇద్దరిలో ఎవరు చెప్పింది వాస్తవమో తేల్చాలంటూ మేయర్‌తోపాటు కమిషనర్‌ను సభ్యులు డిమాండ్ చేశారు. ఆ తరువాత ఆ అంశం మరుగునపడిపోయింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అంత మొత్తంతో గుర్రాలపార్కు ఏర్పాటుచేయాల్సిన అవసరం లేదని సభ్యులు

... మిగతా 6వ పేజీలో

బియ్యం ఎగుమతులపై నిఘా

పోర్టు ద్వారా రేషన్ బియ్యం విదేశాలకు వెళ్లకుండా నియంత్రించేందుకు టాస్క్ ఫోర్స్

- పౌర సరఫరాలు, రెవెన్యూ, పోలీస్, పోర్టు అధికారులతో ఏర్పాటు
- బియ్యం టెస్టింగ్‌కు పోర్టులోనే లేబొరేటరీ...



బియ్యంతో ఉన్న కంటైనర్లతో పౌరసరఫరాల అధికారులు (ఫైల్ ఫొటో)

విశాఖపట్నం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి):

రేషన్ బియ్యం నగరంలోని పోర్టు ద్వారా విదేశాలకు ఎగుమతి అవుతున్నట్టు సమాచారం అందుతుండడంతో జిల్లా అధికారులు అప్రమత్తమయ్యారు. పౌర సరఫరాలు, రెవెన్యూ, పోలీస్, పోర్టు అధికారులతో ఒక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటుచేయాలని నిర్ణయించారు. ఇందుకు సంబంధించి కలెక్టర్ నేతృత్వంలో అధికారులతో ఒక సమావేశం నిర్వహించనున్నారు.

పౌర సరఫరాల మంత్రిత్వశాఖ నుంచి వచ్చిన సమాచారం మేరకు అధికారులు మంగళ, బుధవారాల్లో కంటెయినర్ ఫ్రైట్ స్టేషన్లపై దాడులు చేసి 473 టన్నుల బియ్యం పట్టుకున్న సంగతి తెలిసిందే. వాటి నుంచి నమూనాలను సేకరించి టెస్టింగ్‌కు లేబొరేటరీకి పంపారు. ఆ బియ్యం ప్రజా పంపిణీ వ్యవస్థకు చెందినవా?, కాదా?...అనేది ఒకటి, రెండు రోజుల్లో తేలనున్నది. గత ఏడాది కాకినాడ పోర్టులో పీడీఎస్ బియ్యం భారీగా పట్టుకున్నారు. కాకినాడ పోర్టుపై నిఘా ముమ్మరం చేయడంతో రేషన్ బియ్యాన్ని ఎగుమతి చేసే వ్యాపారులంతా విశాఖ పోర్టును తమ కార్యస్థానంగా మార్చుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న పౌర సరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్ గత ఏడాది ఒకసారి పోర్టు నుంచి ఎగుమతులు చేసే కంటెయినర్ ఫ్రైట్ స్టేషన్లలో తనిఖీలు చేసి రెండుచోట్ల బియ్యం పట్టుకున్నారు. ఒక చోట పట్టుకున్న బియ్యం చౌక డిపోల నుంచి వచ్చినవేనని నిర్ధారణ కావడంతో కేసు నమోదు చేయించారు.

విశాఖ పోర్టు నుంచి రేషన్ బియ్యం ఎగుమతులు కొనసాగుతున్నట్టు ప్రభుత్వానికి ఫిర్యాదులు వెళ్లాయి. ఈ నేపథ్యంలో నిరంతరం పోర్టులో పనిచేసేలా టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటుచేయాలని అధికారులు నిర్ణయించారు. ఏపీలో చౌక డిపోల్లో ఫోర్టిఫైడ్ బియ్యం మాత్రమే సరఫరా చేస్తున్నారు. అందువల్ల రాష్ట్రంలో ఎక్కడైనా రేషన్ బియ్యం కొనుగోలు చేసి విశాఖ పోర్టుకు

... మిగతా 6వ పేజీలో

నేడు బ్లాస్ట్ ఫర్నేస్-3 ప్రారంభం

- పూర్తిస్థాయికి కర్మాగారం ఉత్పత్తి



స్టీల్‌ప్లాంట్‌లోని బ్లాస్ట్‌ఫర్నేస్-3

విశాఖపట్నం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి):

విశాఖపట్నం స్టీల్ ప్లాంటులో బ్లాస్ట్ ఫర్నేస్-3ని శుక్రవారం మధ్యాహ్నం ప్రారంభిస్తున్నారు. ప్లాంటును పూర్తి సామర్థ్యంతో నడిపినప్పుడే నష్టాలను అధిగమించి లాభాలు వస్తాయని ఉక్కు మంత్రిత్వ శాఖ భావించడం, దానికి తగిన నిధులు కేంద్రం సమకూర్చడంతో గత డిసెంబరులో మూతపడిన బీఎఫ్-3ను పునఃప్రారంభించేందుకు సిద్ధం చేశారు. దీనికి అవసరమైన కూలింగ్ ప్లేట్లను చైనా నుంచి తెప్పించి ఆగమేఘాలపై బిగించారు. ఇప్పటికే ఫర్నేస్‌లో 800 టన్నుల కోల్‌ను వేశారు. శుక్రవారం దీనిని ఉక్కు మంత్రిత్వ శాఖ సెక్రటరీ సందీప్ పాండ్రిక్ చేతులు మీదుగా చార్జింగ్ చేయిస్తారు. ఎయిర్ బ్లోయింగ్ చేసిన తరువాత ఇంకో 700 టన్నుల కోల్, సింటర్ వేస్తారు. వారం రోజులకు

... మిగతా 6వ పేజీలో

హైవే మరమ్మతుల్లో నాణ్యతాలోపం

కాంట్రాక్టు సంస్థ ఇష్టారాజ్యం

- పనులపై కొరవడిన ఉన్నతాధికారుల పర్యవేక్షణ
- అనేకచోట్ల పైకి తేలుతున్న రాళ్లు, ఊడుతున్న తారు
- ఎడ్జ్‌లు కలపడంలో నిర్లక్ష్యం..
- వాహనాలు పార్కింగ్ చేసి ఉంటే అక్కడ వదిలేసిన వైనం



గురుద్వారా-మద్దిలపాలెం మధ్య అసంపూర్తిగా రహదారి నిర్మాణం



సత్యం జంక్షన్ వద్ద వాహనాలు పార్క్ చేసిన ప్రాంతంలో పనులు చేయకుండా వదిలేసిన దృశ్యం

విశాఖపట్నం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి):

జాతీయ రహదారి మరమ్మతు పనుల్లో నాణ్యత లోపించింది. అనేకచోట్ల కాంట్రాక్టు సంస్థ నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోంది. నేషనల్ హైవే అథారిటీ అధికారుల పర్యవేక్షణలోపం ఇందుకు కారణమనే విమర్శ ఉంది. నగరం మీదుగా 16వ నంబర్ జాతీయ రహదారి వెళుతోంది. కొన్నాళ్లుగా ఈ రోడ్డుపై అనేకచోట్ల గుంతలు ఏర్పడడంతో దారుణంగా తయారైంది. ఇదే విషయాన్ని గుర్తించిన నేషనల్ హైవే అథారిటీ అధికారులు రోడ్డు మరమ్మతు పనులు చేపట్టాలని భావించారు. ఐదేళ్ల నిర్వహణను కాంట్రాక్టు సంస్థకు అప్పగించారు. ఈ సంస్థ కొద్దిరోజుల కిందట అనకాపల్లి నుంచి ఆనందపురం వరకూ 50 కిలోమీటర్ల మేర పనులను ప్రారంభించింది. ఇప్పటికే ఒకవైపు 40 కిలోమీటర్లు, మరోవైపు 20 కిలోమీటర్లు పనులు చేపట్టినట్టు చెబుతోంది. అయితే, ఈ పనుల్లో నాణ్యత లోపించిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. కొన్నిచోట్ల తారు, మరికొన్నిచోట్ల

... మిగతా 6వ పేజీలో

నేటి నుంచి అవుట్‌సోర్సింగ్ కార్మికుల సమ్మె

- నీటి సరఫరాకు అంతరాయం కలిగే అవకాశం

విశాఖపట్నం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి):

జీవీఎంసీ నీటి సరఫరా విభాగంలో పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్ కార్మికులు శుక్రవారం నుంచి నిరవధిక సమ్మెకు దిగుతున్నట్టు కాంట్రాక్టు వర్కర్స్ మరియు లేబర్ యూనియన్ ప్రకటించింది. ఈ మేరకు యూనియన్ ప్రధాన కార్యదర్శి ఆర్.సత్యం, గౌరవ అధ్యక్షుడు ఎం.ఆనందరావు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. అవుట్‌సోర్సింగ్

... మిగతా 6వ పేజీలో

నేడు జగన్నాథుని రథయాత్ర

- వేడుకగా కల్యాణ మహోత్సవం

మహారాణిపేట, జూన్ 26 (ఆంధ్రజ్యోతి):

జగన్నాథుని రథోత్సవానికి రంగం సిద్ధమైంది. టౌన్ కొత్తరోడ్డులోని ఆలయం వద్ద ఉదయం 9.20 గంటలకు జగన్నాథ స్వామి రథంపై కొలువుదీరుతారు. సాయంత్రం 4.15 గంటలకు రథయాత్ర ప్రారంభమవుతుంది. టర్నర్ చౌల్ట్రీ వద్ద కల్యాణ మండపంలో ఏర్పాటుచేసిన గుండిచా మందిరంలో స్వామి పదిరోజుల పాటు దశావతారాల్లో భక్తులకు దర్శనమిస్తారు. జూలై ఏడో తేదీన మారు రథయాత్ర నిర్వహిస్తారు. ఉత్సవాల్లో భాగంగా గురువారం ఆలయంలో బలభద్ర, సుభద్ర సమేత జగన్నాథుని కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. వైఖానస ఆగమ సంప్రదాయంలో, మంగళవాయిద్యాలు, వేద మంత్రాల మధ్య కార్యక్రమం నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఈవో టి.రాజగోపాల్‌రెడ్డి, ఆధ్యాత్మికవేత్త ఎంపీ రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.



నేడు స్టాండింగ్ కమిటీ సమావేశం

- 286 అంశాలతో అజెండా
- పూర్ణామార్కెట్, గాజువాకల్లో వర్క్ ఆర్డర్ ఇవ్వకుండానే ప్రైవేటు వ్యక్తులు ఆశీలు వసూలు చేయడంపై వాడీవేడిగా చర్చ జరిగే అవకాశం



విశాఖపట్నం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి):

జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సమావేశం శుక్రవారం నిర్వహించనున్నట్టు కార్యదర్శి బీవీ రమణ తెలిపారు. మేయర్ పీలా శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకునేందుకు వీలుగా 286 అంశాలతో అజెండాను తయారుచేశారు. ఇంజనీరింగ్ విభాగంలో పనిచేస్తున్న డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లకు కారు సదుపాయం కల్పించడం, పాఠశాలలు, వార్డు సచివాలయాలకు మినరల్ వాటర్ సరఫరా, స్వర్ణభారతి ఇండోర్ స్టేడియం నిర్వహణకు రూ.48 లక్షల వ్యయం, నీటి సరఫరా విభాగంలో తాగునీటి పైప్‌లైన్‌ల నిర్మాణం, మరమ్మతులు, వివిధ వార్డుల్లో అభివృద్ధి పనులు, తదితర అంశాలను అజెండాలో ప్రతిపాదించారు. పూర్ణామార్కెట్, రామకృష్ణా రైతుబజార్, గాజువాక మార్కెట్‌లో

... మిగతా 6వ పేజీలో

పింఛనుదారులకు డీఏలు జమ చేయాలి

భీమిలి పెన్షనర్ల సంఘం



సమావేశంలో పాల్గొన్న పెన్షనర్లు

భీమునిపట్నం (రూరల్) జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : పింఛనుదారులకు కరువు భత్యం వెంటనే మంజూరు చేయాలని భీమిలి పింఛనుదారుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. గురువారం జిల్లా పింఛనుదారుల సమావేశం విశాఖ జిల్లా పరిషత్తులో నిర్వహించారు. భీమిలి నుంచి అత్యధిక మంది పింఛనుదారులు హాజరయ్యారు. ఈ సంఘం అధ్యక్ష కార్యదర్శులు తట్టికోట భీమారావు, ఎం. ఆనందరావు, కోశాధికారి పెట్ట రామకృష్ణ, సీనియర్ నాయకులు బొట్ట సూరిబాబు, కె.సన్యాసినాయుడు, పొట్ట కృష్ణ చిలక రమణ తదితరులు మాట్లాడుతూ పదవీవిరమణ చేసిన ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న కరువు భత్యాన్ని వెంటనే మంజూరు చేయాలని కోరారు. సర్వీసులో ఉంటుండగా అందించిన ఆరోగ్య బీమా కార్డులను పునరుద్ధరించి ట్రెజరీ కార్యాలయాల్లో అందించాలని కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

భీమునిపట్నం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : వీధి విక్రయదారుల నగర కమిటీకి అనధికారుల సభ్యత్వం కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు భీమిలి జోనల్ కమిషనరు అయ్యప్పనాయుడు తెలిపారు. విశాఖ నగరపాలక సంస్థలో వీధి విక్రయదారుల నగర కమిటీలో నలుగురు అనధికార సభ్యులను వివిధ వ్యాపార వృత్తులకు చెందిన వారు, ఎన్జీవోలు, కమ్యూనిటీ బేస్ట్ ఆర్గనైజేషన్ నామినేషన్ విధానం ద్వారా మూడేళ్ల కాలపరిమితికి ఎంపిక చేస్తారన్నారు. దీనికై ఈనెల 27న డ్రాఫ్ట్ అందజేసేందుకు, 28న సాయంత్రం 5 గంటల్లోగా దరఖాస్తులు దాఖలు చేయాలన్నారు. ఇతర వివరాలకు జోనల్ కార్యాలయంలోని యూసీడీ విభాగంలో పొందవచ్చన్నారు.

జూలై 10 వరకు పశువులకు నట్టల నివారణ టీకాలు

పద్మనాభం-రూరల్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 26 నుంచి జూలై 10 వరకు గొర్రెలు, మేకలకు ఉచితంగా నట్టల నివారణ మందులు వేయనున్నట్టు మండల పశువైద్యాధికారి కె.మహేశ్‌కుమార్ తెలిపారు. గురువారం ఉదయం కృష్ణాపురంలో 256 పశువులకు నట్టల నివారణ మందులు వేసినట్టు ఆయన తెలిపారు. ఈ నట్టల నివారణ కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలనిఆయన కోరారు.



స్వామివారికి స్వర్ణ పుష్పాలతో పూజ చేస్తున్న అర్చకుడు

సింహాద్రినాథునికి స్వర్ణ సంపెంగలతో పూజలు

సింహాచలం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): సింహాద్రి అప్పన్న స్వామికి బంగారు సంపెంగలతో గురువారం ప్రత్యేక పూజలు చేశారు. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలను యథావిధిగా పూర్తి చేశాక ఉత్సవ మూర్తి గోవిందరాజస్వామి, ఉభయ దేవేరులను శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. అనంతరం పసిడి సంపెంగ పువ్వులతో నారసింహ అష్టోత్తర శతనామావళి (108) పఠిస్తూ పూజలు చేశారు. భక్తులకు వేదాశీర్వచనాలు, శేష వస్త్రాలు, ప్రసాదాలను అందజేశారు. ఆ తరువాత ఇదే వేదికపై స్వామివారి నిత్య కల్యాణాన్ని జరిపారు.

అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం

దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్న ప్రసాద పథకానికి గుంటూరు జిల్లా కుంచనపలికి చెందిన మానే రజని రూ.లక్ష విరాళాన్ని అందజేశారు.

29న జ్యోతిష శాస్త్రంపై సదస్సు

సాగర్‌నగర్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ ఆస్ట్రలాజికల్ సైన్సెస్ (ఐసీఏఎస్) ఆధ్వర్యంలో ఈ నెల 29న గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో జ్యోతిష శాస్త్రంపై జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్టు నిర్వాహక కార్యదర్శి, విశాఖ శాఖ అధ్యక్షుడు జొన్నలగడ్డ శ్రీనివాసరావు తెలిపారు. దేశ నలుమూలల నుంచి 200 మందికి పైగా జ్యోతిష శాస్త్రవేత్తలు హాజరవుతారన్నారు. కేంద్ర ప్రభుత్వ విద్యా మంత్రిత్వశాఖకు చెందిన ఇండియన్ నాలెడ్జి సిస్టమ్స్ విశ్రాంత అధికారి, ఐసీఏఎస్ జాతీయ అధ్యక్షుడు ప్రొఫెసర్ ఎ.బి.శుక్లా ముఖ్యఅతిథిగా హాజరవుతారని, వాస్తు చింతామణి గ్రంథాన్ని ఆవిష్కరించడం జరుగుతుందన్నారు.

విత్తన శుద్ధితో దిగుబడులు

పద్మనాభం- రూరల్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): విత్తన శుద్ధితో నాణ్యమైన దిగుబడులు వస్తాయని మండల వ్యవసాయాధికారి ఎంపీ చలం అన్నారు. గురువారం మద్ది రైతు సేవా కేంద్రం ఆవరణలో ప్రస్తుతం నిర్వహిస్తున్న విత్తన సరఫరాను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా చలం రైతులతో మాట్లాడుతూ విత్తన శుద్ధి చేయడం వల్ల మొలకెత్తే దశలోనే తెగుళ్ల బారినుంచి పంటను రక్షించుకోవచ్చన్నారు. అందరూ క్రిమిసంహారిక మందులు, ఎరువుల వినియోగాన్ని తగ్గించాలని సూచించారు.

మత్తు పదార్థాలకు విద్యార్థులు దూరంగా మెలగాలి

పలు విద్యాసంస్థల్లో అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినం **విద్యార్థులతో అవగాహన ర్యాలీలు**



భీమిలి డిగ్రీ కళాశాలలో మాదక ద్రవ్యాల వ్యతిరేక ర్యాలీ

భీమునిపట్నం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : జీవితాన్ని నాశనం చేసే మత్తుకు యువత బానిసలవుతుండడం ప్రస్తుత సమాజంలో ఆందోళన కలిగిస్తోందని భీమిలి ప్రభుత్వ ఎస్‌వీఎల్‌ఎన్‌ఎస్ డిగ్రీ కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ విష్ణుమూర్తి అన్నారు. గురువారం ఆ కళాశాలలో అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చైతన్య ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత మత్తుకు దూరంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో ఆ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ పీవోలు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తగరపువలసలో..

తగరపువలస, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని చిట్టివలస అంబేడ్కర్ జీవీఎంసీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వై.స్వామి కోరారు. గురువారం అంతర్జాతీయ మాదకద్రవ్య దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని స్కూలులో నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి మాట్లాడుతూ సమాజంలో వీటి వినియోగం ఎక్కువ అవుతోందని, నిరోధించాల్సిన అవసరం ప్రతివారిపైనా ఉందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించి బహుమతులను అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుల జగదీశ్, ఆర్.అప్పలరాజు ప్రమీల, శ్రీదేవి, విశ్వేశ్వరరావు సునీత తదితరులు మాట్లాడారు.

అఖిల భారత సమ్మె వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నేతలు

తగరపువలస, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : వచ్చే నెల 9న దేశవ్యాప్తంగా నిర్వహించనున్న అఖిల భారత కార్మికుల సమ్మెను జయప్రదం చేయాలని రూపొందించిన వాల్‌పోస్టర్‌ను గురువారం చిట్టివలస సీఐటీయూ కార్యాలయం వద్ద సంఘ నేతలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఐటీయూ నేతలు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రూపొందించిన నాలుగు కార్మిక చట్టాలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంటు అమ్మకాన్ని నిలిపి వేయాలని, ఈ ప్లాంటులో తొలగించిన కార్మికుల్ని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని, అవుట్ సోర్సింగ్ కాంట్రాక్టు కార్మికుల్ని పర్మినెంటు చేయాలని కోరారు. కార్మికుల పింఛను కనీసం రూ.9 వేలుగా నిర్ణయించాలని, కార్మికులకు ఇబ్బందిగా ఉన్న మోటార్ ట్రాన్స్‌పోర్టు సవరణ చట్టం 2019ను తక్షణం రద్దు చేయాలని, పరిశ్రమల్లో స్థానికులకు 75 శాతం ఉద్యోగాలు ఇవ్వాలి తదితర డిమాండ్లను స్థానికంగా తాము చేర్చి ఈ సార్వత్రిక సమ్మెలో పాల్గొంటున్నామని సీఐటీయూ జోనల్ కార్యదర్శి మూర్తి తెలిపారు. కార్యక్రమంలో సంఘ నేతలు అప్పలనాయుడు, పి.సూర్యనారాయణ, నీలాటి రాము, పల్లరాజు రమణ పాల్గొన్నారు.

ఘనంగా సుభద్రాదేవి శాంతి కళ్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భీమునిపట్నం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ప్రసిద్ధ శ్రీజగన్నాథస్వామి ఆలయంలో గురువారం ఉదయం నేత్రోత్సవం ఘనంగా నిర్వహించారు.. ప్రతీ ఏటా ఆషాడశుద్ధ పాడ్యమి నాడు స్వామి నేత్రోత్సవం నిర్వహించడం ఆనవాయితీ. ఈ సందర్భంగా, బలభద్ర, సుభద్ర సమేత జగన్నాథస్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో పుసులూరి వెంకట దుర్గానాగమౌళి, వెంకట జగన్నాథ దంపతులతో వైఖానసాగమ విధిగా వైభవంగా సుభద్రాదేవి, జగన్నాథస్వామి వారి శాంతి కళ్యాణం జరిగింది. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని కళ్యాణాన్నితిలకించి తరించారు.

నేడు బ్లాస్ట్ ఫర్నేస్-3 ప్రారంభం

... 5వ పేజీ తరువాయి

సిలికాతో కూడిన హాట్ మెటల్ వస్తుంది. దాని తరువాత జూలై పదో తేదీ నుంచి అసలైన హాట్ మెటల్ ఉత్పత్తి అవుతుంది. ఇందులో నుంచి రోజుకు ఏడు వేల టన్నుల ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. మిగిలిన రెండు బ్లాస్ట్ ఫర్నేస్‌ల ద్వారా ప్రస్తుతం 14వేల టన్నులు వస్తోంది. మూడు బ్లాస్ట్ ఫర్నేస్‌లకు అవసరమైన ముడి పదార్థాలను నిరంతర సరఫరా చేస్తే రోజుకు 21 వేల టన్నుల ఉత్పత్తి జరుగుతుంది. అలా ఆరు నెలలు చేస్తే ప్లాంటును నష్టాల నుంచి లాభాల బాటలోకి తీసుకురావచ్చునని యాజమాన్యం చెబుతోంది.

హైవే మరమ్మతుల్లో నాణ్యతాలోపం

... 5వ పేజీ తరువాయి

రాళ్లు పైకి తేలాయి. చాలాచోట్ల రహదారి అంచులు కూడా సరిగా కలపలేదు. దీంతో వాహన చోదకులు ఇబ్బందిపడుతున్నారు. ఇక, కొన్నిచోట్ల పనులు చేపట్టకుండానే వదిలేశారు. వాహనాలు పార్కింగ్ చేసి ఉంటే వాటిని తీయించి అక్కడ పనులు చేపట్టాల్సిన బాధ్యత కాంట్రాక్ట్ సంస్థదే. అయితే, అందుకు విరుద్ధంగా వాహనాలు పార్కింగ్ చేసి ఉంటే ఆయా ప్రాంతాలను వదిలేసి ముందు కు వెళ్లిపోయారు. దీంతో అటువంటిచోట్ల రహదారి దారుణంగా కనిపిస్తోంది. పనులను పర్యవేక్షించాల్సిన అధికార యంత్రాంగం పట్టించుకోకపోవడమే పనులు నాసిరకంగా ఉండడానికి కారణమన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ఈ పనులపై దృష్టిసారించాలని నగరవాసులు కోరుతున్నారు.

కార్మికులకు జీతాలు చెల్లించకపోవడం దారుణం

సీఐటీయూ జోన్ కమిటీ అధ్యక్షుడు డి.అప్పలరాజు



జీవీఎంసీ జోన్-2కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న నాయకులు, కార్మికులు

కొమ్మాది, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ అవుట్‌సోర్సింగ్ కార్మికులకు జీతాలు చెల్లించకపోవడం దారుణమని సీఐటీయూ జోన్ కమిటీ అధ్యక్షుడు డి.అప్పలరాజు అన్నారు. గురువారం జోన్-2 కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం విద్యా సంవత్సరం ప్రారంభమైందని, రెండు నెలలుగా అవుట్‌సోర్సింగ్ కార్మికులకు జీతాలు చెల్లించకపోతే పిల్లలకు ఫీజులు ఎలా కడతారన్నారు. కుటుంబాలతో ఎలా జీవనం సాగిస్తారని ప్రశ్నించారు. అవుట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ ఉద్యోగులుగా భావించి తల్లికి వందనం పథకాన్ని వర్తింపజేయకపోవడం అన్యాయమన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 30న చేపట్టనున్న జీవీఎంసీ ప్రధాన కార్యాలయం ముట్టడి కార్యక్రమంలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బి.నరసింగరావు, జాన్, బాలకృష్ణ, అచ్చియమ్మ, నరేశ్, తదితరులు పాల్గొన్నారు.

అవుట్‌సోర్సింగ్ కార్మికుల ర్యాలీ

మధురవాడ: మునిసిపల్ అవుట్‌సోర్సింగ్ కార్మికులకు రెండు నెలలుగా వేతనాలు చెల్లించకపోవడంతో వారు తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని సీఐటీయూ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. మునిసిపల్ కార్మికుల వేతనాలతో పాటు పలు సమస్యలపై ఐదో నుంచి ఎనిమిదో వార్డు వరకు నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జోనల్ కమిటీ అధ్యక్షుడు డి.అప్పలరాజు మాట్లాడుతూ పనిచేస్తున్న కార్మికులకు వేతనాలు చెల్లించకపోతే వారు కుటుంబాలతో ఎలా జీవనం సాగిస్తారని ప్రశ్నించారు. స్టీల్ ప్లాంటులో కాంట్రాక్టు కార్మికులను తొలగించడంతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతుందని మండిపడ్డారు. ర్యాలీలో నాయకులు నరసింగరావు, జాన్, బాలకృష్ణ, అచ్చియ్యమ్మ, రమణ, కొండమ్మ, దుర్గ, తదితరులు పాల్గొన్నారు..



అశోక్‌తో పాటు కుటుంబ సభ్యులకు ఆశీస్సులు అందజేస్తున్న వేదపండితులు

అశోక్‌గజపతిరాజుకు వేదపండితుల ఆశీస్సులు

సింహాచలం, జూన్ 26(ఆంధ్రజ్యోతి): వరాహలక్ష్మీనృసింహస్వామి దేవస్థానం, తదితర 103 ఆలయాల అనువంశిక ధర్మకర్త, కేంద్ర మాజీ మంత్రి పూసపాటి అశోక్‌గజపతిరాజుకు పలువురు జన్మదిన శుభాశీస్సులు అందజేశారు. గురువారం సింహాద్రి అప్పన్న స్వామి ఆలయ ప్రధాన అర్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, కరి సీతారామాచార్యులు, తదితర వేదపండితులు అశోక్‌గజపతిరాజును విజయనగరంలోని ఆయన నివాసంలో కలిసి చతుర్వేద స్వస్తి వచనాలతో ఆశీర్వదించారు. అనంతరం పర్యవేక్షణాధికారి జీవీవీఎస్‌కె ప్రసాద్, డీఈఈ డీవీవీఎస్ రామరాజు (హరి) దుశ్శాలువాతో ఆయనను సత్కరించి స్వామివారి ప్రసాదాలను అందజేశారు.

మాదక ద్రవ్యాల అనర్థాలపై ర్యాలీ

ఎండాడ, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాలతో కలిగే అనర్థాలను వివరిస్తూ గురువారం ఎండాడ జడ్పీ పాఠశాలకు చెందిన విద్యార్థులు, ఎన్‌సీసీ క్యాడెట్లు, స్కౌట్స్ అండ్ గైడ్స్ వలంటీర్లు అవగాహన ర్యాలీ నిర్వహించారు. మాదక ద్రవ్యాల వినియోగంతో యువత, సమాజం పాడవుతుందని, అందువల్ల ఎవరూ వీటి జోలికి వెళ్లకూడదని ఎన్‌సీసీ ట్రైనర్ ఉపాధ్యాయుడు చుక్కా హరికుమార్ కోరారు. మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలను స్కౌట్స్ అండ్ గైడ్స్ విభాగ ప్రతినిధి ఉపాధ్యాయురాలు ఎ.భాగ్యలక్ష్మీ వివరించారు. ర్యాలీలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

వారాహి నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం

ఎండాడ, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ఇక్కడి కోదండరామాలయం, షిర్డీ సాయి, గణపతి, పశుపతినాథేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని హరిహర క్షేత్రంలో శ్రీవారాహి మాత నవరాత్రి ఉత్సవాలను గురువారం అర్చకులు రామకృష్ణశర్మ ఆధ్వర్యంలో వైభవంగా ప్రారంభించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేయగా, అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. శుక్రవారం వారిహి మాతకు ఆవర్ణార్చన సందర్భంగా విశిష్ట పూజలు జరుతుతాయని, భక్తులు దర్శించుకుని అమ్మవారి ఆశీసులు పొందాలని ఆయన కోరారు.

బీఆర్‌టీఎస్ టీడీఆర్‌ల పరిష్కారానికి కమిటీ

సింహాచలం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మహా విశాఖ నగరపాలక సంస్థ ప్రతిష్ఠాత్మకంగా 2008లో చేపట్టిన శ్రీఘ్ర రవాణా వ్యవస్థ (బీఆర్‌టీఎస్)లో అంతర్భాగమైన సింహాచల కారిడార్‌లోని తొలిపావంచా నుంచి పాత అడవివరం కూడలి వరకు ఉన్న టీడీఆర్‌ల సమస్య పరిష్కారానికి ప్రభుత్వం ఆరుగురు సభ్యులతో కూడిన ప్రత్యేక కమిటీని నియమించింది. ఈ మేరకు రాష్ట్ర మునిసిపల్ పరిపాలన, అర్బన్ డెవలప్‌మెంట్ విభాగ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేశ్‌కుమార్ ఈ నెల 17న మెమో జారీ చేశారు. ఈ కమిటీకి ఛైర్మన్‌గా మునిసిపల్ పరిపాలన, నగరాభివృద్ధి విభాగ కమిషనర్ అండ్ డైరెక్టర్ వ్యవహరించనున్నారు. సభ్యులుగా జీవీఎంసీ కమిషనర్, దేవదాయశాఖ (రెవెన్యూ) రాష్ట్ర కమిషనర్, రాష్ట్ర ప్రభుత్వ న్యాయ విభాగ అదనపు కార్యదర్శి, నగర, దేశ ప్రణాళికా విభాగ కన్వీనర్ కమ్ సభ్యునిగా, జీవీఎంసీ ముఖ్య ప్రణాళికాధికారి వ్యవహరిస్తారు. ఈ కమిటీ గత రెండేళ్లుగా అపరిష్కృతంగా ఉన్న బీఆర్‌టీఎస్ సింహాచల కారిడార్ ఫేజ్-2 నిర్మాణానికి సహకరించిన నిర్వాసితుల సమస్యలపై అధ్యయనం చేసి వాటి పరిష్కారానికి అనుసరించాల్సిన విధి విధానాలపై ప్రభుత్వానికి నెల రోజుల్లో నివేదిక సమర్పించాల్సి ఉంటుంది.

వృద్ధులు, దివ్యాంగులకు రేషన్ పంపిణీ

పద్మనాభం-రూరల్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదేశాల మేరకు 65 ఏళ్లు పైబడిన వృద్ధులు, దివ్యాంగులకు గురువారం పలు పంచాయతీ కేంద్రాల్లో ఇంటింటికీ వెళ్లి డీలర్లు రేషన్ సరకులను పంపిణీ చేసినట్టు తహశీల్దార్ ఆనందరావు తెలిపారు. మండలంలో 22 పంచాయతీల్లో గల 38 రేషన్ షాపుల ద్వారా ఈ నెల 30 వరకు వృద్ధులు, దివ్యాంగులకు రేషన్ సరకులను సరఫరా చేయడం జరుగుతందన్నారు.

గొర్రెలు, మేకలకు 10 వరకు నట్టల నివారణ మందులు

పద్మనాభం-రూరల్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): గొర్రెలు, మేకలకు గురువారం నుంచి జూలై 10వరకు ఉచితంగా నట్టల నివారణ మందులు వేయనున్నట్టు మండల పశు వైద్యాధికారి కె.మహేశ్‌కుమార్ తెలిపారు. గురువారం ఉదయం కృష్ణాపురంలో 256 పశువులకు నట్టల నివారణ మందులు వేశామన్నారు. పశువుల పెంపకందారులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

పద్మనాభం-రూరల్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ప్రజలందరూ తమ ఇళ్లతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఈవోపీఆర్డీ మీనాకుమారి కోరారు. గురువారం రేవిడి, అనంతవరం, మద్ది గ్రామాల్లో ఆమె పర్యటించి పారిశుధ్య కార్మికులు చేపడుతున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రజలకు పారిశుధ్యంపై అవగాహన కల్పించారు. ఇళ్ల పరిసరాల్లో కాకుండా రోడ్లపై చెత్తాచెదారం లేకుండా చూసుకోవాలన్నారు. ఆయా పంచాయతీ కార్యదర్శులు పైడయ్య, సాయిలను పారిశుధ్యం పనుల గురించి అడిగి తెలుసుకున్నారు.

నేడు ఈపీడీసీఎల్ సూపర్ ఈసీబీసీ భవనం ప్రారంభం

హాజరుకానున్న విద్యుత్ శాఖా మంత్రి గొట్టిపాటి, సీఎస్ విజయానంద్



మంత్రి ప్రారంభించనున్న నూతన భవనం

విశాఖపట్నం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర విద్యుత్ శాఖా మంత్రి గొట్టిపాటి రవి కుమార్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, విద్యుత్ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ విజయానంద్ శుక్రవారం విశాఖపట్నం వస్తున్నారు. సాగర్‌నగర్‌లో నిర్మించిన సూపర్ ఎనర్జీ కన్జర్వేషన్ బిల్డింగ్ కోడ్ (ఈసీబీసీ) భవనాన్ని వారు ప్రారంభిస్తారని ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ గురువారం తెలిపారు. సుమారు రూ.14 కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ భవనానికి కేంద్ర ప్రభుత్వ సంస్థ 'బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియెన్సీ' రూ.5 కోట్లు ప్రోత్సాహకంగా ఇచ్చిందన్నారు. ఈ భవనం విద్యుత్ బిల్లుల భారాన్ని గణనీయంగా తగ్గిస్తుందన్నారు. ఈపీడీసీఎల్ పరిధిలోని 11 జిల్లాల ఉద్యోగులకు శిక్షణ కోసం ఈ భవనం నిర్మించామన్నారు. జూనియర్ లైన్‌మెన్ నుంచి పై స్థాయి ఉద్యోగులకు శిక్షణ కార్యక్రమాలు ఇక్కడ నిర్వహిస్తామన్నారు. విశాఖపట్నం సాగరతీరంలో 24 సబ్‌స్టేషన్లను ఆటో స్విచ్చింగ్ సబ్‌స్టేషన్లుగా మార్చి పెదవాల్తేరులో అనుసంధానం చేసిన స్కాడా భవనాన్ని కూడా మంత్రి రవికుమార్ సందర్శిస్తారన్నారు. సంస్థలో పనిచేస్తూ చనిపోయిన 19 మంది ఉద్యోగుల వారసులకు కారుణ్య నియామకం పత్రాలు అందిస్తారని వివరించారు.

ఐటీ కంపెనీల దాగుడుమూతలు

... 5వ పేజీ తరువాయి

తరువాత అన్నమాట. ఏడాదిలోగా ఎక్కడో ఒక భవనం తీసుకొని అందులో కొంత మందితో కంపెనీని ప్రారంభించి, ఆ తరువాత సొంత భవనంలోకి మారి పూర్తిస్థాయిలో విస్తరించవచ్చు. ఆ విధంగా ప్రభుత్వం కూడా ఒప్పించాలి. 2029 ఎన్నికల సంవత్సరం. ఒకవేళ అప్పటికి ఉద్యోగాలు ఇవ్వకపోతే ప్రభుత్వ లక్ష్యం నెరవేరే అవకాశం లేదు. దీనిపై పునరాలోచన చేయాల్సి ఉంది.

బియ్యం ఎగుమతులపై నిఘా

... 5వ పేజీ తరువాయి

తీసుకువస్తే వెంటనే నిర్ధారించవచ్చు. అదే ఛత్తీస్‌గఢ్‌లో కొన్ని జిల్లాల్లో ఫోర్టిఫైడ్ రైస్‌ను, మరికొన్ని జిల్లాల్లో సాధారణ బియ్యం అందిస్తున్నారు.

సాధారణ బియ్యం రేషన్ దుకాణాల ద్వారా పంపిణీ చేసిందో, కాదో... నిర్ధారించడం వెంటనే సాధ్యంకాదని అధికారులు చెబుతున్నారు. వాటిని లేబొరేటరీకి పంపితే కొంతవరకూ గుర్తించవచ్చునంటున్నారు. ఈ నేపథ్యంలో విశాఖ పోర్టు పరిధిలోనే బియ్యం టెస్టింగ్ లేబొరేటరీ ఒకటి ఏర్పాటుచేయాలని యోచిస్తున్నారు. పోర్టు నుంచి రేషన్ బియ్యం రవాణాను పూర్తిగా అరికట్టేలా నిఘా ముమ్మరం చేస్తామని జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ తెలిపారు. త్వరలో టాస్క్‌ఫోర్స్ ఏర్పాటుచేసి పోర్టు నుంచి రేషన్ బియ్యం ఎగుమతులకు అడ్డుకట్ట వేస్తామన్నారు.

నేడు స్టాండింగ్ కమిటీ సమావేశం

... 5వ పేజీ తరువాయి

ఆశీలు వసూలుపై సమావేశంలో వాడీవేడి చర్చ జరిగే అవకాశం ఉంది. స్టాండింగ్ కమిటీ ఆమోదం తర్వాత ఆశీలు వసూలు బాధ్యతలను కాంట్రాక్టర్లకు అప్పగించాలి. అప్పటివరకూ రెవెన్యూ విభాగం సిబ్బంది ద్వారా వసూలు చేయించి, ఆ మొత్తాన్ని ప్రతిరోజూ సౌకర్యం కేంద్రంలో జమ చేయాలి. కానీ స్టాండింగ్ కమిటీ అనుమతి లేకపోయినా, వర్క్ ఆర్డర్‌ను అధికారులు అందజేయకపోయినా వేలంలో పాట దక్కించుకున్న వారు ఏప్రిల్ ఒకటి నుంచే ఆశీలు వసూలు చేసుకుంటున్నారు. గెజిట్ కంటే నాలుగైదు రెట్లు ఎక్కువ వసూలుచేసి, అధికారులకు వాటాలు ఇచ్చి నామమాత్రపు మొత్తాన్ని జీవీఎంసీకి జమ చేస్తున్నారు.

దీనిపై స్టాండింగ్ కమిటీ సభ్యులు పూర్తి ఆధారాలు సంపాదించడంతో అధికారులను నిలదీసే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది.

గుర్రపు స్వారీకి 3 కోట్లు ధారాదత్తం

... 5వ పేజీ తరువాయి

అభ్యంతరం చెప్పడంతో ప్రాజెక్టును నిలిపివేసింది. అయితే అందుకోసం వెచ్చించిన రూ.3 కోట్ల ప్రజా ధనాన్ని బాధ్యులైన వారి నుంచి రికవరీ చేయాలనే డిమాండ్ వినిపిస్తోంది. అప్పటి కమిషనర్ సాయికాంత్‌వర్మ నుంచి ఆ నిధులను రికవరీ చేయాలని కొందరు, మేయర్ నుంచి వసూలు చేయాలని మరికొందరు డిమాండ్ చేస్తున్నారు. ఏదిఏమైనా భవిష్యత్తులోనైనా ప్రజాధనం దుర్వినియోగం చేయకుండా అడ్డుకట్టవేయాలంటే చట్ట ప్రకారం అనుసరించాల్సిన ప్రక్రియను పక్కనపెట్టి గుర్రపు స్వారీ కోసం డబ్బును దుర్వినియోగం చేసిన వారి నుంచి రికవరీ చేయాల్సిన అవసరం ఉందని కార్పొరేటర్లు సైతం అభిప్రాయపడుతున్నారు.

నేటి నుంచి అవుట్‌సోర్సింగ్ కార్మికుల సమ్మె

... 5వ పేజీ తరువాయి

విధానంలో పనిచేస్తున్న కార్మికుల్లో పదేళ్ల అనుభవం కలిగివుండి టెక్నికల్ విధులు నిర్వర్తిస్తున్న దాదాపు 900 మందిని సెమీ స్కిల్డ్ కేటగిరీలో చేర్చి, ఆ మేరకు వేతనాలు ఇవ్వాలని కార్మిక సంఘాలు చాలాకాలంగా డిమాండ్ చేస్తున్నాయి. గత ఏడాది డిసెంబరులో జరిగిన కౌన్సిల్ సమావేశంలో వేతనాల పెంపునకు ఆమోదం తెలిపారు. ఈ మేరకు అధికారులు ప్రతిపాదనలు తయారుచేసి దాదాపు 900 మందికి రూ.6 వేలు చొప్పున మే నెల నుంచి జీతం పెంచుతూ ఆప్కోస్ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేశారు. కానీ పలు కారణాలతో పాత వేతనాలనే చెల్లించారు. దీనిపై జీవీఎంసీలోని అన్ని కార్మిక సంఘాలు ఈనెల 11 నుంచి నిరవధిక సమ్మెలోకి దిగుతున్నట్టు ప్రకటించాయి. నగరంలో నీటి సరఫరా నిలిచిపోతుందని భావించిన అధికారులు, మేయర్ పీలా శ్రీనివాసరావు...కార్మిక సంఘాల నేతలతో చర్చలు జరిపారు. పదిహేను రోజులు సమయం ఇస్తే కొత్త వేతనాలను అమలు చేస్తామని హామీ ఇచ్చారు. అయితే జూన్ నెలకు సంబంధించిన జీతాల చెల్లింపునకు పాతపద్ధతిలోనే వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయడంతో అధికారులు, మేయర్ మాట తప్పారని ఆరోపిస్తూ గురువారం అర్ధరాత్రి తర్వాత విధులను బహిష్కరించి సమ్మెకు దిగాలని కార్మిక సంఘాల నేతలు నిర్ణయించారు. కార్మికులు సమ్మెకు దిగితే శుక్రవారం నగరంలో నీటి సరఫరాకు అంతరాయం కలిగే అవకాశం ఉంది.

వర్షాలకు నేలకొరిగిన విద్యుత్ స్తంభం, చెట్టు



పడిపోయిన విద్యుత్ స్తంభం, చెట్టు

మద్దిలపాలెం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : నగరంలో గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో పిఠాపురం కాలనీలోని కళాభారతి రోడ్డులో భారీ వృక్షం, విద్యుత్ స్థంభం నేలకొరిగాయి. ఆ సమయంలో చెట్టు కింద ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ఇటీవల కళాభారతి రోడ్డులో డ్రైనేజీ పనుల కోసం గోతులు తవ్వారు. ఈలోగా వర్షం ప్రారంభం కావడంతో పనులు తాత్కాలికంగా నిలిపి వేశారు. దీంతో గోతులు తవ్విన సమీపంలో ఉన్న బాదం చెట్టు వేర్లు బలహీనపడి ఈదురు గాలులకు పడిపోయింది. ఆ చెట్టు కాస్త పక్కనే ఉన్న విద్యుత్ స్తంభంపై పడడంతో ఆ స్తంభం కూడా నేలకొరిగింది. విద్యుత్ శాఖ సిబ్బంది వచ్చి విద్యుత్ లైన్లను తప్పించారు. అయితే నేలకొరిగిన చెట్టు, స్థంభాన్ని తొలగించలేదు. నేల మీద పడిన వృక్షం, స్తంభాన్ని వెంటనే తొలిగించాలని స్థానికులు కోరుతున్నారు.

సంపత్ వినాయగర్ ఆలయ హుండీ లెక్కింపు

26 రోజులకు రూ.17,27,278 ఆదాయం



లెక్కింపును పర్యవేక్షిస్తున్న ఆలయ ఈవో డీవీవీ ప్రసాదరావు, ఫౌండర్ మెంబర్ టీఆర్ చోళన్

సిరిపురం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : సంపత్ వినాయగర్ దేవాలయం హుండీ ఆదాయాన్ని గురువారం లెక్కించారు.గడిచిన 26 రోజులకు రూ.17,27,278 నగదు లభించినట్టు ఆలయ సహాయ కమిషనర్ డీవీవీ ప్రసాద్‌రావు, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ టి.ఆర్.చోళన్ తెలిపారు.దేవాలయ కార్యాలయ ఆవవరణలో నిర్వహించిన హుండీ లెక్కింపులో బంగారం 000-006-817 మిల్లీ గ్రాములు, వెండి 000-022 గ్రాముల 300 మిల్లీ గ్రాములు, యుఎస్ఏ డాలర్స్ 133, సింగపూర్ డాలర్స్ 20, కెనడా డాలర్స్ 40, యూరో కరెన్సీ 5 వచ్చినట్టు తెలిపారు.హుండీ లెక్కింపునకు శ్రీ వెంకటేశ్వర సేవా సంఘం సభ్యులు, దేవాదాయ, ధర్మాదాయశాఖ తనిఖీదారులుగా ఎం.శ్రీధర్, దేవాలయ సిబ్బంది జి.గోవిందరెడ్డి, డీఎస్ ప్రసాద్, బ్యాంక్ ఆఫ్ ఇండియా సిబ్బంది పాల్గొన్నారని తెలిపారు.

సినిమా గైడ్

● **కన్నప్ప** : జగదాంబ, కిన్నెర, శ్రీకన్య, లీలామహల్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), నటరాజ్ (పెందుర్తి), లిఖిత (శ్రీహరిపురం), అరుణ (పెదగంట్యాడ),

● **కుబేర** : మెలోడి, సంగం, శ్రీరామా, కామేశ్వరి, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), సుకన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)

● **ఎఫ్.1** : రమాదేవి, జగదాంబ,

● **మార్గన్** : శారద, శరత్, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక), రమాదేవి,

● **8 వసంతాలు** : శ్రీ వెంకటేశ్వర, కన్య హెవెన్ (గాజువాక).

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 23, టమాటా 24, వంకాయలు (తెలుపు) 30, వంకాయలు (నలుపు) 36, బెండకాయలు 28, పచ్చిమిర్చి 54, కాకరకాయలు 40, బీరకాయలు 320, ఆనపకాయ 16, కాలీఫ్లవర్ 36, క్యాబేజి 18, క్యారెట్ 38, దొండకాయలు 30, బంగాళదుంపలు 18, అరటికాయ (పె)10, మునక్కాడలు (కిలో) 94, అల్లం (పాతది)50, బరబాటి 34, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 60, బద్దచిక్కుడు 50, దోసకాయలు 16, వెల్లుల్లి (పెద్దవి) 90, కొబ్బరికాయ (పెద్దది) 24, బీన్స్ (పెన్సిల్) 110, కీర దోస 32, కాప్సికమ్ 76, పొట్లకాయ (పెద్దది) 40, చేమదుంపలు 36, చిలగడ దుంపలు 30, కంద 52, దేముడు చిక్కుడు 56, గోరుచిక్కుడు 40, కూర పెండలం 26, బ్రకోలి 45, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 4, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 20, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 18, మామిడి అల్లం 56, బొప్పాయి 30, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	575
విజయనగరం	579
శ్రీకాకుళం	579

చికెన్ ధరలు బ్యాగ్	
రైతు ధర	85
లైవ్ ధర	105
విత్ స్కిన్	180
స్కిన్‌లెస్	190

దారి పొడవునా చెత్తాచెదారాలే..

» అపరిశుభ్రతకు కేరాఫ్‌గా 18వ వార్డు » అధ్వానంగా రహదారులు » వర్షాకాలం కావడంతో తప్పని ఇబ్బందులు

ఎంవీపీ కాలనీ, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : ఎంవీపీ కాలనీ... తెలుగు రాష్ట్రాల్లో ఎక్కడఈ పేరు చెప్పినా.. విశాఖపట్నంలోని ముఖ్యమైన, ఖరీదైన అన్ని వసతులు గల ప్రాంతం అని ఇట్టే చెబుతారు. అయితే, వాస్తవంగా చూస్తే ప్రస్తుతం అం దుకు భిన్నంగా ఇక్కడి పరిస్థితి మారిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఎంవీపీ కాలనీ అనే పేరుతో పిలిచే ముప్పలవానిపాలెం 'పేరు గొప్ప ఊరు దిబ్బ' చందంగా తయారైందని స్థానికులు వాపోతున్నారు.

ఈ కాలనీ పరిధిలోని జీవీఎంసీ 18వ వార్డులో గల వెంకోజీపాలెం నుంచి మెడికవర్ ఆస్పత్రి వెనుకగా, డీఆర్‌డీఏ కార్యాలయం వరకూ విశాలమైన రోడ్డు ఉంది. ఇరువైపులా ఉన్నత కుటుంబాలు ఉన్న బహుళ అంతస్థుల భవనాలు ఉన్నాయి. కానీ ఈ రహదారి ప్రారంభ కూడలిలోనే చిన్న చినుకు పడినా బురదమయంగా కనిపిస్తుంది. ఇంకాస్తా ముందుకు వెళితే రోడ్డుపైనే పశువులు సంచరిస్తుంటాయి. కైలాసగిరి హెల్త్ ఎరీనాలో బుద్ధుడి విగ్రహం ఎదురుగా ప్రవేశ ద్వారం ఈ మార్గంలోనే ఉంది. పర్యాటకులు, సందర్శకులు ఇటువైపే వస్తుంటారు. ఒక చో వ్యర్థాలు రోడ్డు పక్కనే గుట్టలుగా పోసేశారు. అంతేకాకుండా ఒక్కోచోట ఎప్పుడో పడేసిన చెట్ల కొమ్మలు కూడా ఎండిపోయి కనిపిస్తుంటాయి. జీవీఎంసీ పారిశుధ్య విభాగం, ప్రణాళిక విభాగం అప్పుడప్పుడూ దృష్టి సా మొదటికే వస్తోంది.



అధ్వానంగా ఉన్న వెంకోజీపాలెం మెడికవర్ వెనుక ఉన్న రహదారి



ఎంవీపీ రెండో సెక్టరు డీఆర్‌డీఏ కార్యాలయం రోడ్డులో పశువుల సంచారం



ఆరో సెక్టరు వద్ద రహదారిని అనుకుని పడి ఉన్న గృహ నిర్మాణ వ్యర్థాలు

స్థానికుల్లో చైతన్యం కొరవడడం, పశువుల సంచారం, రోడ్లు గోతులమయంగా ఉండడంతో వర్షం వచ్చినప్పుడు నీరు చేరి పరిసరాలు అపరిశుభ్రగా మారడం తదితర కారణాల వల్ల ఈ ప్రాంతం అధ్వానంగా కనిపిస్తుంటుంది. ఈ మార్గంలో రోడ్డు గోతులమయంగా మారిపోవడం కూడా సమస్యగా మారింది. నిబంధనలు అతిక్రమించే వారిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో స్థానికులు కొందరు రోడ్డును తమ స్వప్రయోజనాలకు వాడేస్తున్నారు. దీంతో ఎప్పుడు చూసినా ఈ దారి పొడవునా చెత్తాచెదారం, పశువుల సంచారం, గృహనిర్మాణ, ఇతరత్రా వ్యర్థాలు దర్శనమిస్తుంటాయి. ఓ చోట ప్రైవేటు ఖాళీ స్థలాన్ని డంపింగ్ యార్డుగా మార్చేసి, అందులో చెత్తాచెదారం పోసేస్తుంటారు. ఆ చెత్తను సకాలంలో పారిశుధ్య సి బ్బంది తరలించకపోవడంతో వర్షం వచ్చినప్పుడు నీరు చేసి కుళ్లి కంపుకొడుతోందని స్థానికులు వాపోతున్నారు. ఈ మా ర్గంలో పారిశుధ్య నిర్వహణపై జీవీఎంసీ అధికారులు దృష్టి సారించాలని కోరుతున్నారు.

సౌకర్యం

ఉద్యోగి చేతివాటం

» పన్నుల రూపంలో వసూలు చేసిన రూ.50 లక్షలను సొంతానికి వాడుకున్న వైనం
» దర్యాప్తు నివేదిక వచ్చాక చర్యలు: వేపగుంట జడ్సీ హైమావతి

వేపగుంట, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ వేపగుంట జోనల్ కార్యాలయ పరిధిలో ఇంటి పన్నులు వసూలు చేసి సౌకర్యం కేంద్ర ఉద్యోగి సొంతానికి వాడుకున్న విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దీనిపై ప్రాథమిక విచారణ జరిపి సదరు ఉద్యోగిపై అధికారులు చర్యలు చేపట్టారు. వివరాలిలా ఉన్నాయి. ఇక్కడి సౌకర్యం కేంద్రంలో పన్నులు వసూలు చేసే ఉద్యోగి గత కొద్దిరోజులుగా ప్రజల నుంచి వసూలు చేసిన సొమ్మును జీవీఎంసీ బ్యాంక్ అకౌంట్‌కు జమ చేయకుండా సొంతానికి వాడుకున్నట్టు తేలింది. సాధారణంగా ఏ రోజు వసూలయ్యే నగదును అదే రోజు సాయంత్రం లేదా మర్నాడు ఉదయం బ్యాంకుకు జమ చేయాలి. అయితే ఇక్కడ పనిచేస్తున్న ఉద్యోగి పది రోజులకు పైగా వసూలు చేసిన సుమారు రూ.50 లక్షలను బ్యాంకుకు జమ కట్టలేదని అధికారులు గుర్తించారు. ఇందుకు కారణం ఎప్పటికప్పుడు పర్యవేక్షించే అధికారుల అలసత్వమా, లేకుంటే వారు కూడా సంబంధిత ఉద్యోగికి సహకారాన్ని అందించారా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం సదరు ఉద్యోగి నుంచి సుమారు రూ.10 లక్షల వరకు అధికారులు వసూలు చేసినట్టు తెలిసింది. మిగతా సొమ్మును కూడా రాబట్టేందుకు చర్యలు చేపడుతున్నారు.

ఈ నేపథ్యంలో సంబంధిత ఉద్యోగిని వేరే విభాగానికి మార్చినట్టు జడ్సీ కె.హైమావతి గురువారం రాత్రి తెలిపారు. ఉద్యోగిపై విచారణకు ఆదేశించామని, దర్యాప్తు నివేదిక వచ్చిన వెంటనే జీవీఎంసీ కమిషనర్ ఆదేశాల మేరకు చర్యలు చేపట్టడం జరుగుతుందని పేర్కొన్నారు.

కొత్తవలస రైల్వే స్టేషన్‌లో టికెట్ తనిఖీలు

» 2,030 మంది నుంచి రూ.12 లక్షల జరిమానా



కొత్తవలస స్టేషన్‌లో చెకింగ్ సిబ్బంది

విశాఖపట్నం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): టికెట్ లేని ప్రయాణాన్ని నియంత్రించడంతో పాటు ప్రయాణికుల భద్రత, సురక్షితమైన ప్రయాణం అందించడంలో భాగంగా వాల్తేరు డివిజన్ పరిధిలోని కొత్తవలస రైల్వే స్టేషన్‌లో గురువారం టికెట్ తనిఖీలు చేపట్టారు. కమర్షియల్ విభాగం, ఆర్పీఎఫ్ సిబ్బంది సమన్వయంతో చేపట్టిన ప్రత్యేక డ్రైవ్‌లో టికెట్ లేకుండా ప్రయాణిస్తున్నవారితోపాటు పార్శిల్ బుకింగ్ ద్వారా తీసుకువెళ్లాల్సిన లగేజిని కోచ్‌లో తీసుకువెళుతున్నవారిపై 2,030 కేసులు నమోదు చేసి వారి నుంచి సుమారు రూ.12 లక్షలు జరిమానా వసూలు చేసినట్టు సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. ఈ ఆర్థిక సంత్సరంలో ఒకేరోజులో అత్యధిక కేసులు నమోదు చేయడంతోపాటు సుమారు రూ.12 లక్షలు జరిమానా వసూలు చేయడం ఇదే ప్రథమమన్నారు. సురక్షిత ప్రయాణ పద్ధతులు పాటించాలని, తప్పనిసరిగా టికెట్ తీసుకోవాలని, రైలు ఎక్కే, దిగే సమయంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

అవయవదానంపై విస్తృత ప్రచారం అవసరం

» ఏపీ జీవన్‌ధాన్ కో-ఆర్డినేటర్ డాక్టర్ కె.రాంబాబు



సమావేశంలో సందేశ నివృత్తి చేస్తున్న రాష్ట్ర జీవన్‌దాన్ కో-ఆర్డినేటర్ రాంబాబు

ఆరిలోవ జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : అవయవదానంపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ ప్రత్యేక దృష్టి సారించాలని ఏపీ జీవన్‌ధాన్ కో-ఆర్డినేటర్ డాక్టర్ కె.రాంబాబు పిలుపునిచ్చారు. గురువారం విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (విమ్స్)లో జీవనదాన్ ఈస్ట్ జోన్ జిల్లాల ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా జీవనదాన్ కింద 73 ఆస్పత్రులు నమోదు చేసుకున్నట్టు ఆయన తెలిపారు.. అయితే వాటిలో 50 శాతం ఆస్పత్రుల్లో ఒక్క బ్రెయిన్ డెడ్ కేసు కూడా ప్రకటించకపోవడం ఆలోచించాల్సిన విషయమన్నారు. ముఖ్యంగా ప్రభుత్వ ఆస్పత్రులకు బ్రెయిన్ డెడ్ కేసులు వస్తున్నప్పటికీ వాటిని ప్రకటించడంలో వైద్యులు ఆసక్తి చూపించడం లేదన్నారు. దీనికి కారణం బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తి నుంచి అవయవాల స్వీకరించడంలో రోగి బంధువులకు సరైన అవగాహన కల్పించలేకపోవడమేనన్నారు. అలాగే మృతి చెందిన వ్యక్తి శరీరం అవయవాలను తీసేందుకు వైద్యబృందం అందుబాటులో లేకపోవడం కూడా కారణమన్నారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు ప్రతి ఆస్పత్రిలో అవయవదానంపై అవగాహన కల్పిస్తూ బోర్డులను ఏర్పాటు చేయడంతో పాటు హెల్ప్ డెస్క్ కూడా ఏర్పాటు చేయాలని సూచించారు. అవయవాలు స్వీకరించేందుకు వైద్య బృందం లేకపోయినా బ్రెయిన్ డెడ్ అయినట్టు ప్రకటించి తమ దృష్టికి తీసుకుని వస్తే అవయవాలు స్వీకరించేందుకు వైద్య బృందాన్ని పంపిస్తామని తెలిపారు. అతి తక్కువ విభాగాలు ఉన్న విమ్స్ ఆస్పతిలో మూడు బ్రెయిన్ డెడ్ కేసులను ప్రకటించి, రోగి శరీరం నుంచి అవయవాలను స్వీకరించి రాష్ట్ర ప్రభుత్వ ఆరోగ్య రంగంలో సరికొత్త చరిత్ర సృష్టించామన్నారు. విమ్స్ ఆస్పత్రి స్ఫూర్తితో రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో కూడా బ్రెయిన్ డెడ్ రోగులను ప్రకటించి వారి కుటుంబాల చేత అవయవ దానం చేసేలా అవగాహన కల్పించాలని సూచించారు. అవయవ దానం చేసే రోగికి రాష్ట్ర ప్రభుత్వం అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించడంతో పాటు పది వేల రూపాయిలు అంత్యక్రియల ఖర్చులు నిమిత్తం అందజేస్తుందన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా అవయవ దానంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి అన్ని విధాలుగా ప్రోత్సహిస్తోందన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులు కూడా తమ వంతు బాధ్యతగా అవయవదానంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు ప్రతి ఒక్క ఆస్పత్రిలో అవయవ దానం కోసం కో-ఆర్డినేటర్ల వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఒక మానవతా దృక్పథం సేవా దృక్పదంతో ఆలోచిస్తే విజయవంతం అవ్వటం ఖాయమన్నారు.

ఈ సందర్భంగా ఆసుపత్రుల అధికారులకు ఉన్న సందేహాలు నివృత్తి చేయడంతో పాటు వారు తెలిపిన సలహాలు సూచినలను రాష్ట్ర ప్రభుత్వదృష్టికి తీసుకుని వెళ్లడం జరుగుతుందన్నారు.

గిరి ప్రదక్షిణ ఏర్పాట్లపై జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి సమీక్ష

వెంకోజీపాలెం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : జూలై 9న సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి గిరి ప్రదక్షిణకు సంబంధించి జీవీఎంసీ ప్రజా ఆరోగ్య విభాగం చేయవలసిన ఏర్పాట్లపై జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఈఎస్వీ నరేష్‌కుమార్ ఆ విభాగం అధికారులతో గురువారం ఆయన చాంబర్లో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎంహెచ్‌వో మాట్లాడుతూ శ్రీవరహాలక్ష్మీనరసింహస్వామి గిరి ప్రదక్షిణకు లక్షలాదిమంది భక్తులు పాల్గొంటారని, అందుకు జీవీఎంసీ పారిశుధ్యం, మరుగుదొడ్లు, దోమల నియంత్రణ తదితర వాటిపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై జీవీఎంసీ సహాయ వైద్యాధికారులు, శానిటరీ సూపర్‌వైజర్లు, పీఎంయూ సిబ్బందికి తగు సూచనలు, సలహాలు ఇవ్వడం జరిగిందని తెలిపారు. భక్తులు నడిచే దారి పొడుగునా పారిశుధ్య కార్మికులను ఏర్పాటు చేసేందుకు రూట్‌మ్యాప్‌ను ఏర్పాటు చేసి ఆయా ప్రాంతాల్లో పారిశుధ్య కార్మికులను ఏర్పాటు చేయాలన్నారు. బయాలజిస్టు ఆధ్వర్యంలో సిబ్బంది దోమల నివారణకు స్ప్రేయింగ్, ఫాగింగ్ చేసేందుకు సిద్ధంగా ఉండాలన్నారు.

కేర్‌లో విజయవంతంగా అనూరిజం శస్త్రచికిత్స

» వైద్య శాస్త్రంలో క్లిష్టమైన ఆపరేషన్
» రోజు కూలీకి ప్రాణాపాయ స్థితి నుంచి కాపాడిన వైద్యులు



వివరాలను వెల్లడిస్తున్న కేర్ వైద్యబృందం

ఆరిలోవ, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): కేర్ ఆస్పత్రి వైద్య బృందం క్లిష్టమైన అనూరిజం శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించి ఓ వ్యక్తిని ప్రాణాపాయస్థితి నుంచి కాపాడారు. ఈ వివరాలను వైద్యులు గురువారం మీడియాకు తెలిపారు. కూలి పని చేసుకునే జొన్నాడె నల్లెంశెట్టి (49)కి ఏడాదిగా ఊపిరి పీల్చడంలో ఇబ్బంది ఎదురైంది. కడుపునొప్పి, దగ్గుతో పాటు రక్తం పడుతుండడంతో ఇటీవల కేర్ ఆస్పత్రిలో వైద్య పరీక్షలు చేయించుకున్నాడు. సిటీ ఆర్థోగ్రామ్ పరీక్షలో గుండెకు దగ్గరగా ఉన్న ప్రధాన రక్తనాళంలో బెలూన్ వంటి వాపు (అనూరిజం) ఉన్నట్టు వైద్యులు గుర్తించారు. దాని చుట్టూ రక్తస్రావం జరుగుతోంది. గుండె పనితీరు బాగుండడంతో పాటు రక్తనాళాలు సాధారణంగానే ఉన్నాయి. ఊపిరితిత్తుల స్కాన్‌లో ఇన్ఫెక్షన్, కావిటీస్ కనిపించాయి. బ్రోంకోస్కోపీ ద్వారా వాయుమార్గాల్లో మలినాలు, రక్తం గడ్డకట్టినట్టు గుర్తించారు. రక్త పరీక్షలు చేయగా, తీవ్రమైన మంట (ఇన్‌ఫ్లమేషన్) ఉన్నట్టు నిర్ధారణ అయింది. ఎండోస్కోపీలో జీర్ణవ్యవస్థలో రక్తస్రావం లేదని తేలింది. ఈ క్లిష్ట పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని వైద్యులు కార్డియో పల్మనరీ బైపాస్ (సీపీబీ) సహాయంతో అనూరిజం సర్జరీ చేశారు. ఆపరేషన్ తర్వాత తక్కువ మందులతో సిటీ ఐసీయూకు తరలించారు. ప్రస్తుతం రోగి కోలుకున్నట్టు వైద్యులు తెలిపారు. సమావేశంలో కేర్ హాస్పిటల్స్ సీనియర్ కార్డియోథొరాసిక్ సర్జన్ డాక్టర్ రేవంత్ మారంరెడ్డి, కేర్ హాస్పిటల్స్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ మయూఖ చౌదురి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పుట్‌బాల్ టోర్నీకి జిల్లా జట్టు



విశాఖపట్నం, స్పోర్ట్సు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి అండర్-14 బాలుర ఫుట్‌బాల్ టోర్నీలో పాల్గొనే జిల్లా జట్టును గురువారం ప్రకటించారు. మదనపల్లిలో ఈనెల 29 నుంచి జరగనున్న టోర్నీకి 22 మంది సభ్యులతో జిల్లా జట్టును ప్రకటించారు. వీరేంద్ర, డబ్ల్యు మహేష్, సీహెచ్ అశ్వంత్, బి.కార్తీక్, ఎం.లోహిత్, ఎస్.సంతోష్, ఎం.రాహుల్, వి.సాత్విక్, సీహెచ్.ప్రణదీప్, బి.ప్రజ్వాల్, సీహెచ్.లోహన్ కాంత్, బెంజిమన్, ఎ.వివేక్, జె.ప్రవీణ్, వై.హరీష్, పి.ధనుష్ యాదవ్, సాయివిదేష్, ఎల్.రఘువీర్, కె.భగేష్, అపూర్వ చెరబ్, బి.చరణ్, కె.తేజసాయి స్వరూప్ ఎంపికయ్యారు. కోచ్‌లుగా గోపాలకృష్ణ, అజీజ్, మేనేజర్‌గా త్రినాథరావు వ్యవహరిస్తారు.

పీవీ చలపతిరావు సేవలు చిరస్మరణీయం

» కేంద్ర ఉక్కుశాఖ సహాయ మంత్రి శ్రీనివాస వర్మ



సమావేశంలో మాట్లాడుతున్న కేంద్రమంత్రి శ్రీనివాస వర్మ

ఎంవీపీ కాలనీ, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : మాజీ ఎమ్మెల్సీ పీవీ చలపతిరావు అందించిన సేవలు ఈ రాష్ట్ర రాజకీయ రంగానికే కాకుండా, దేశాభివృద్ధికి కూడా ఎంతో తోడ్పడ్డాయని కేంద్ర ఉక్కు శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ అన్నారు. ఎంవీపీ కాలనీలోని ఐఏఎం ఆడిటోరియంలో గురువారం పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ ప్రతిపాదించిన అఖండ మానవతావాదం సిద్ధాంతానికి అరవై వసంతాలు పూర్తి అనే అంశంపై ప్రత్యేక సెమినార్, పీవీ చలపతిరావు 91వ జయంతి కార్యక్రమాలను ఢిల్లీకి చెందిన రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఫౌండేషన్ ఫర్ ఇంటిగ్రల్ హ్యూమనిజం, పీవీ చలపతిరావు ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఎమర్జెన్సీ కాలం 22 నెలల్లో పీవీ చలపతిరావు 19 నెలల 19 రోజులు అజ్ఞాతంలో గడిపారన్నారు. పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ ప్రతిపాదించిన అఖండ మానవతావాదం భారతీయ తత్వశాస్త్రం, సంస్కృతికి సమగ్ర దృక్పథాన్ని అందించిందన్నారు. ఆంధ్రప్రదేశ్ ఆర్‌ఎస్‌ఎస్ క్షేత్ర ప్రచారక్ భరత్ కుమార్ మాట్లాడుతూ భారతీయ సంప్రదాయాలను ఆధారంగా చేసుకుని పండిట్ జీ ప్రతిపాదించిన ఈ తత్వం సామాజిక న్యాయం, ఆర్థిక స్వావలంబన, సంస్కృతికి గౌరవం కోసం ఒక బలమైన మానవ కేంద్రిత మౌళిక దృక్పథం అన్నారు. మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్ సభాధ్యక్షత వహించారు. కార్యక్రమంలో మళ్ల సాంబశివ, సత్యారావు మాస్టర్, నారాయణరావు, పరశురామరాజు, సుబ్బిరామిరెడ్డి, కొప్పిశెట్టి మాధురి, భాజపా, ఆర్ ఎస్ ఎస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

విశాఖ పోర్టు అథారిటీ ఛైర్మన్‌తో

జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ భేటీ



పోర్టు అథారిటీ ఛైర్మన్‌ను కలిసిన జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్

వెంకోజీపాలెం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : విశాఖ పోర్టు అథారిటీ ఛైర్మన్ డాక్టర్ అంగముత్తును మర్యాదపూర్వకంగా జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ విశాఖ పోర్టు అథారిటీ కార్యాలయంలోని ఆయన ఛాంబర్‌లో గురువారం కలిసి పూలమొక్కను అందించారు. ఈ సందర్భంగా వారిరువురూ విశాఖ అభివృద్ధిపై చర్చించుకున్నారు. తదుపరి పోర్టు అథారిటీ ఛైర్మన్ జీవీఎంసీ కమిషనర్‌కు జ్ఞాపికను బహూకరించారు.

మానసిక ఆరోగ్యంతో ఒత్తిడి లేని బోధన సాధ్యం

» వ్యక్తిత్వ వికాస శిక్షకురాలు డాక్టర్ పద్మాక్షిలోకేష్

ఎంవీపీ కాలనీ, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : మానసికంగా ఆరోగ్యంగా ఉంటే ఒత్తిడి లేని బోధన సాధ్యమవుతుందని బెంగుళూరుకు చెందిన క్లినికల్ సైకాలజిస్ట్, వ్యక్తిత్వ వికాస శిక్షకురాలు డాక్టర్ పద్మాక్షిలోకేశ్ పేర్కొన్నారు. ఎంవీపీ కాలనీలోని ఐఏఎం కళాశాల ఆడిటోరియంలో గురువారం ఉదయం నిర్వహించిన మైండ్‌ఫుల్‌నెస్ సెమినార్‌లో ఆమె ప్రసంగించారు. ఆధునిక విద్యావేత్తలు వివిధ రకాల ఒత్తిళ్లు, బోధనా వృత్తి పాత్ర, ప్రాముఖ్యత అనే అంశాలపై ఆమె పలు అంశాలను వివరించారు. ఉపాధ్యాయుల మానసిక పరిస్థితి ఆధారంగా బోధన ఉంటుందన్నారు. ఒత్తిడి లేని జీవితాన్ని ప్రణాళికబద్ధంగా మార్చుకోవడంపై పలు అంశాలను వివరించారు. వివిధ సంస్థల నుంచి అధ్యాపకులు, పరిశోధకులు, విద్యానిపుణులు పాల్గొన్న సెమినార్‌లో ప్రారంభోపన్యాసాన్ని ఐఏఎం డీన్ అండ్ డైరెక్టర్ డాక్టర్ ఎస్వీ రవీంద్ర చేశారు. డైరెక్టర్ జనరల్ ప్రొఫెసర్ వి.కృష్ణమోహన్, ఏకూ కాలేజ్ ఆఫ్ లా ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సీతామాణిక్యం తదితరులు ప్రసంగించారు.

భీమిలి బీచ్‌లో సినిమా షూటింగ్ సందడి



బీచ్‌లో డాన్స్ వేస్తున్న హీరో రోహన్

భీమునిపట్నం, జూన్ 25 (ఆంధ్రజ్యోతి) : భీమిలి బీచ్‌లో గురువారం తెలుగు సినిమా షూటింగ్ జరిగింది. వెంకట్ పంపాన దర్శకత్వంలో తెరకెక్కిస్తున్న పాన్ ఇండియా సినిమా షూటింగ్ జరిగింది. ఈ సినిమాలో హీరోగా రోహన్, హీరోయిన్‌గా హారిక నటిస్తున్నారు. బీచ్‌లో హీరో డ్యాన్స్ చేస్తున్నటుట్టు కొన్ని సన్నివేశాలు చిత్రీకరించారు. ఈ చిత్రానికి నిర్మాతగా సాగి సత్యనారాయణ రాజు వ్యవహరిస్తున్నారు.

విద్యలో సాంకేతికతను మిళితం చేయాలి

» ప్రొఫెసర్ ఎం.జేమ్స్ స్టీఫెన్



సమావేశంలో పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థులు

వెంకోజీపాలెం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ) భువనేశ్వర్‌లో 'ఏఐ, అడాప్టివ్ లెర్నింగ్ ఇన్‌ఇన్ క్లూజివ్ ఎడ్యుకేషన్' అనే అంశంపై ఏయూలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఛైర్ ప్రొఫెసర్ అయిన ప్రొఫెసర్ ఎం.జేమ్స్ స్టీఫెన్ రెండు ప్రత్యేక ప్రసంగాలు అందించారు. ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ) భువనేశ్వర్‌లో 'ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, సమగ్ర విద్యలో అనుకూలతను పెంపొందించే విద్యా విధానాలు' అనే అంశంపై జరిగిన (ఎఫ్‌డీపీ)లో ప్రత్యేక ప్రసంగాలు అందించారు. విద్యా రంగంలో ఉన్న సమస్యలకు పరిష్కారం చూపుతూ, సాంకేతికతను అనుసంధానం చేస్తూ సమానత్వాన్ని సాధించే విషయాలు జరిగే ప్రయత్నాన్ని తన ప్రసంగంలో వివరించారు. ప్రత్యేక అవసరాలు కలిగిన వారికి అట్టడుగు వర్గాల వారికి విద్యను ఆధునిక సాంకేతిక విధానాలతో ఏ విధంగా చేరువ చేయవచ్చు అనే అంశాన్ని వివరించారు. సమ్మిళిత డిజిటల్ అభ్యసన వ్యవస్థలను నిర్మించాల్సిన ఆవశ్యకతను ఆచార్య జేమ్స్ స్టీఫెన్ తెలియజేశారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ బోధనలో ఉపయోగించే విధానంపై అధ్యాపకులు అడిగిన ప్రశ్నలకు సమాధానమిచ్చారు. డిజిటల్ సాంకేతికత ఉపయోగపడుతున్న విధానాన్ని వివరిస్తూ ఆధునిక డిజిటల్ సాంకేతికత ఫలితంగా అంబేద్కర్ ఆశించిన సామాజిక న్యాయాన్ని చేరువ చేయడం, విద్యలో సాధికారిత సాధించే లక్ష్యాన్ని చేరుకోవడం సాధ్యపడుతోందని తెలియజేశారు. ఈ నెల 23 నుంచి 27 వరకు జరిగే ఈ ఉపన్యాసాలు ఐఐటీ భువనేశ్వర్‌లోని హ్యూమానిటీస్, సోషల్ సైన్సెస్ అండ్ మేనేజ్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో జరిగాయి. "ఎఫ్‌డీపీ అండ్ అనుకూల విద్యా విధానాలు సమగ్ర తరగతులలో" అనే ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం(ఎఫ్‌డీపీ) లోభాగంగా నిర్వహిస్తున్నారు ఈ కార్యక్రమంలో వివిధ విభాగాల అధ్యాపకులకు సమగ్ర విద్యా విధానాల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను సమన్వయం చేసే సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించారు.

నేడు జాబ్ మేళా

కంచరపాలెం,జూన్ 26 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఉపాధి కార్యాలయంలో శుక్రవారం నిరుద్యోగ యువతకు జాబ్‌మేళాను నిర్వహించనున్నట్టు ఉపాధికల్పనాధికారులు కె.శాంతి, డి.అరుణ పేర్కొన్నారు. మేళాలో అపోలో ఫార్మశీ, డెక్కన్‌ఫైన్ కెమికల్స్, శ్రీరామ్ చిట్స్, టీం లీజ్ (ఎస్‌బీఐ), ముథూట్, హెచ్‌డీఎఫ్‌సీ తదితర సంస్థలు పాల్గొని ఇంటర్వ్యూలు నిర్వహిస్తాయన్నారు. పది, ఇంటర్,డిగ్రీ, పీజీతో పాటు ఐటీఐ కోర్సులు పూర్తిచేసిన వారు శుక్రవారం ఉదయం 10 గంటలకు హాజరుకావాలన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ముందుగా నేషనల్ కెరియర్ సర్వీస్ పోర్టల్‌లో తమ వివరాలను నమోదు చేసుకోవాలన్నారు.

సెప్టెంబరు 14న భారతీయ కళా వైభవం

డాబాగార్డెన్స్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): విశాఖ రత్న కళా పరిషత్ ఆధ్వర్యంలో 12 గంటల పాటు నిర్విరామంగా 'భారతీయ కళా వైభవం 2025'ను సెప్టెంబరు 15న నిర్వహించనున్నట్టు విశాఖ రత్న వ్యవస్థాపక అధ్యక్షుడు పీపీ భాస్కరరావు తెలిపారు. డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రం వేదికగా ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు నిర్వహించే ఈ కార్యక్రమాన్ని మహానటుడు ఎన్టీఆర్, పద్మవిభూషణ్ రామోజీరావులకు అంకితమిస్తున్నట్టు తెలిపారు. వివిధ కళా ప్రదర్శనలతో పాటు సినీ సంగీత విభావరి ఉంటాయన్నారు.

వైద్య శిబిరానికి స్పందన

అక్కయ్యపాలెం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 42వ వార్డు రైల్వే ఎగ్జిబిషన్ మైదానం ఎదురుగా ఉన్న షిర్డీ సాయి ధ్యానమందిరంలో గురువారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. మాక్సివిజన్ ఐ ఆస్పత్రి, యోధ డయాగ్నోస్టిక్స్ సిబ్బంది 120 మందికి బీపీ, షుగర్, కంటి పరీక్షలు చేశారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు నూకల శేషగిరిరావు, ఆస్పత్రి ప్రతినిధులు అయ్యప్ప, వేదవతి, శ్రీనివాసరెడ్డి, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

సురేంద్రకు సత్కారం

అక్కయ్యపాలెం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): అక్కినేని అభిమాని, ప్రజా సేవకుడు మళ్ల సురేంద్ర అని నవీన్ ప్రసాద్ అన్నారు. రైల్వే న్యూకాలనీలో గురువారం అక్కినేని అభిమానులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్రను సత్కరించారు. సురేంద్రకు పదవి వరించడం గర్వకారణమన్నారు. బొలిశెట్టి సుబ్బారావు, సుకుమార్‌రెడ్డి, షఫీ, నాగిరెడ్డి, గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

పూరీ రథయాత్రకు ప్రత్యేక రైళ్లు

విశాఖపట్నం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): పూరీ జగన్నాథుని రథయాత్ర భక్తుల సౌకర్యార్థం మరిన్ని ప్రత్యేక రైళ్లను ప్రవేశపెడుతున్నామని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. **విశాఖ-పూరి-విశాఖ:** ఈ రైలు జూలై 6న అర్ధరాత్రి 12.45 గంటలకు విశాఖలో బయలుదేరి మధ్యాహ్నం 12 గంటలకు పూరీ, తిరుగు ప్రయాణంలో జూలై 7న వేకువజాము 2.15 గంటలకు పూరిలో బయలుదేరి మధ్యాహ్నం ఒంటి గంటలకు విశాఖ చేరుతుంది.

జగదల్‌పూర్-పూరి-జగదల్‌పూర్: జూలై 5న ఉదయం 9 గంటలకు జగదల్‌పూర్‌లో బయలుదేరి అర్ధరాత్రి 1.15గంటలకు పూరీ, తిరుగు ప్రయాణంలో జూలై 7న రాత్రి 12.45 గంటలకు పూరీలో బయలుదేరి సాయంత్రం 4.45 గంటలకు జగదల్‌పూర్ చేరుతుంది.

రాయగడ-పూరి-రాయగడ: జూలై 5న ఉదయం 11 గంటలకు రాయగడలో బయలుదేరి రాత్రి 11.45 గంటలకు పూరీ చేరుతుంది. తిరుగు ప్రయాణంలో జూలై 7న రాత్రి ఒంటి గంటకు పూరీలో బయలుదేరి మరునాడు మధ్యాహ్నం మూడు గంటలకు రాయగడ చేరుతుంది.

బీఆర్‌టీఎస్ కారిడార్ టీడీఆర్‌ల పరిష్కారానికి కమిటీ

సింహాచలం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మహా విశాఖ నగరపాలక సంస్థ ప్రతిష్ఠాత్మకంగా 2008లో చేపట్టిన శ్రీఘ్ర రవాణా వ్యవస్థ (బీఆర్‌టీఎస్)లో అంతర్భాగమైన సింహాచల కారిడార్‌లోని తొలిపావంచా నుంచి పాత అడవివరం కూడలి వరకు ఉన్న టీడీఆర్‌ల సమస్య పరిష్కారానికి ప్రభుత్వం ఆరుగురు సభ్యులతో కూడిన ప్రత్యేక కమిటీని నియమించింది. ఈ మేరకు రాష్ట్ర మునిసిపల్ పరిపాలన, అర్బన్ డెవలప్‌మెంట్ విభాగ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేశ్‌కుమార్ ఈ నెల 17న మెమో జారీ చేశారు. ఈ కమిటీకి చైర్మన్‌గా మునిసిపల్ పరిపాలన, నగరాభివృద్ధి విభాగ కమిషనర్ అండ్ డైరెక్టర్ వ్యవహరించనున్నారు. సభ్యులుగా జీవీఎంసీ కమిషనర్, దేవదాయశాఖ (రెవెన్యూ) రాష్ట్ర కమిషనర్, రాష్ట్ర ప్రభుత్వ న్యాయ విభాగ అదనపు కార్యదర్శి, నగర, దేశ ప్రణాళికా విభాగ కన్వీనర్ కమ్ సభ్యునిగా, జీవీఎంసీ ముఖ్య ప్రణాళికాధికారి వ్యవహరిస్తారు. ఈ కమిటీ గత రెండేళ్లుగా అపరిష్కృతంగా ఉన్న బీఆర్‌టీఎస్ సింహాచల కారిడార్ ఫేజ్-2 నిర్మాణానికి సహకరించిన నిర్వాసితుల సమస్యలపై అధ్యయనం చేసి వాటి పరిష్కారానికి అనుసరించాల్సిన విధివిధానాలపై ప్రభుత్వానికి నెల రోజుల్లో నివేదిక సమర్పించాల్సి ఉంటుంది.

అప్పన్నకు స్వర్ణ సంపెంగలతో పూజ

సింహాచలం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): సింహాద్రి అప్పన్న స్వామికి బంగారు సంపెంగలతో గురువారం ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామి, ఉభయ దేవేరులను ప్రత్యేక వేదికపై అధిష్టింపజేశారు. అనంతరం పసిడి సంపెంగ పువ్వులతో నారసింహ అష్టోత్తర శతనామావళి (108) పఠిస్తూ పూజలు చేశారు. భక్తులకు వేదాశీర్వచనాలు, శేష వస్త్రాలు, ప్రసాదాలను అందజేశారు. ఇదే వేదికపై కల్యాణాన్ని జరిపారు.

షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణమే మేలు!

- తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో పెట్రోలు బంకు ఏర్పాటుపై స్థానికుల అభ్యంతరం
- ఇప్పటికే ఒకటి ఉండగా మరొకటి ఎందుకని ప్రశ్న
- షాపింగ్ కాంప్లెక్స్ నిర్మిస్తే మరింత ఆదాయం
- అయినా పట్టించుకోని రెవెన్యూ అధికారులు
- చురుగ్గా సాగుతున్న బంకు నిర్మాణ పనులు


తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో పెట్రోలు బంకు నిర్మాణ పనులు

సీతమ్మధార, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో పెట్రోల్ బంకు ఏర్పాటు పనులు చురుగ్గా సాగుతున్నాయి. ప్రభుత్వ ఆదాయ వనరులు సమకూర్చుకునే ఉద్దేశంతో ఈ నిర్మాణం చేపట్టారు. సీతమ్మధారలో రైతుబజార్ ఎదురుగా చాలా కాలంగా ఓ పెట్రోలు బంకు ఉంది. అయినప్పటికీ అర్బన్ తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో సుమారు వందేళ్ల వయసున్న వృక్షాలను నరికించి మరీ బంకు నిర్మాణ పనులు చేపట్టడాన్ని స్థానికులు తప్పు పడుతున్నారు.. నగర వాసులకు నీడనిచ్చే పెద్ద చెట్లను తహసీల్దార్ రమేష్ దగ్గరుండి మరీ తొలగించడం దారుణమని విమర్శిస్తున్నారు. ఎవరి ప్రయోజనాల కోసం బంకు ఏర్పాటు చేస్తున్నారనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఇక్కడ పెట్రోల్ బంకు ప్రారంభిస్తే ట్రాఫిక్ రద్దీ పెరుగుతుందని, వాహనాలు మలుపు తిప్పడానికి ఇబ్బందులు ఎదురవుతాయని అంటున్నారు. పెద్ద వాహనాలు బంకులోకి వెళ్లేటప్పుడు రోడ్డుపై మరో వాహనం ప్రయాణించేందుకు అవకాశం ఉండదని, అయినప్పటికీ అధికారులు పట్టించుకోలేదని వాపోతున్నారు. కేవలం ఆదాయమే పరమావధిగా అధికారులు బంకు ఏర్పాటు చేస్తున్నారన్నారు.


బంకు ఏర్పాటు కోసం తొలగించిన ఏళ్ల నాటి మర్రిచెట్టు (ఫైల్ ఫొటో)

నగరంలో విశాలమైన ప్రాంతంలో పాతబడిన, పెచ్చులూడిపోతున్న తహసీల్దార్ కార్యాలయ భవనానికి రంగులు వేయించడం ఆశ్చర్యకరంగా ఉందని, ఇక్కడే నూతన భవనాన్ని నిర్మిస్తే ఉపయుక్తంగా ఉంటుందనే అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. శిథిల స్థితిలో ఉన్న ప్రభుత్వ కార్యాలయాల స్థానంలో కొత్త భవనాలు నిర్మించి, అందులో వాణిజ్య సముదాయాన్ని ఏర్పాటు చేసి ఉంటే ఆదాయ వనరులు లభించేవని సూచిస్తున్నారు. అధికారుల ఆనాలోచిత నిర్ణయం వల్ల విశాలమైన స్థలంలో పెట్రోల్ బంకు ఏర్పాటు ఏమిటని విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం తరుణంలో పర్యావరణ పరిరక్షణకు దోహదపడే భారీ వృక్షాలను పరిరక్షించాల్సిన అధికారులే దగ్గరుండి మరీ తొలగించడం దారుణమని వ్యాఖ్యానిస్తున్నారు.

కేర్‌లో విజయవంతంగా అనూరిజం శస్త్రచికిత్స

- రోజు కూలీని ప్రాణాపాయ స్థితి నుంచి కాపాడిన వైద్యులు


వివరాలు వెల్లడిస్తున్న కేర్ వైద్యులు

ఆరిలోవ, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): కేర్ ఆస్పత్రి వైద్య బృందం క్లిష్టమైన అనూరిజం శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించి ఓ వ్యక్తిని ప్రాణాపాయస్థితి నుంచి కాపాడారు. ఈ వివరాలను వైద్యులు గురువారం మీడియాకు తెలిపారు. కూలి పని చేసుకునే జొన్నాడె నల్లెంశెట్టి (49)కి ఏడాదిగా ఊపిరి వీల్చడంలో ఇబ్బంది ఎదురైంది. కడుపునొప్పి, దగ్గుతో పాటు రక్తం పడుతుండడంతో ఇటీవల కేర్ ఆస్పత్రిలో వైద్య పరీక్షలు చేయించుకున్నాడు. సిటీ ఆర్ఘోగ్రామ్ పరీక్షలో గుండెకు దగ్గరగా ఉన్న ప్రధాన రక్తనాళంలో బెలూన్ వంటి వాపు (అనూరిజం) ఉన్నట్టు వైద్యులు గుర్తించారు. దాని చుట్టూ రక్తస్రావం జరుగుతోంది. గుండె పనితీరు బాగుండడంతో పాటు రక్తనాళాలు సాధారణంగానే ఉన్నాయి. ఊపిరితిత్తుల స్కాన్‌లో ఇన్ఫెక్షన్, కావిటీస్ కనిపించాయి. బ్రాంకోస్కోపీ ద్వారా వాయుమార్గాల్లో మలినాలు, రక్తం గడ్డకట్టినట్టు గుర్తించారు. రక్త పరీక్షలు చేయగా, తీవ్రమైన మంట (ఇన్‌ఫ్లమేషన్) ఉన్నట్టు నిర్ధారణ అయింది. ఎండోస్కోపీలో జీర్ణవ్యవస్థలో రక్తస్రావం లేదని తేలింది. ఈ క్లిష్ట పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని వైద్యులు కార్డియో పల్మనరీ బైపాస్ (సీపీబీ) సహాయంతో అనూరిజం సర్జరీ చేశారు. ఆపరేషన్ తర్వాత తక్కువ మందులతో సిటీ ఐసీయూకు తరలించారు. ప్రస్తుతం రోగి కోలుకున్నట్టు వైద్యులు తెలిపారు. సమావేశంలో కేర్ హాస్పిటల్స్ సీనియర్ కార్డియోథొరాసిక్ సర్జన్ డాక్టర్ రేవంత్ మారంరెడ్డి, కేర్ హాస్పిటల్స్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ మయాఖ చౌదురి తదితరులు పాల్గొన్నారు.

జోనల్ వెండింగ్ కమిటీ ఏర్పాటు


నియామక పత్రాలను అందిస్తున్న జెడ్సీ

డాబాగార్డెన్స్ జూన్ 26 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ జోన్ 4 వీధి విక్రయదారులు (స్ట్రీట్ వెండింగ్) జోనల్ కమిటీ సమావేశాన్ని గురువారం జోనల్ కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వీధి విక్రయదారుల సర్వేలో 2,200 మంది నమోదయ్యారన్నారు. ఎనిమిది మందితో కూడిన జోనల్ వెండింగ్ కమిటీని ఏర్పాటు చేశామని, వెండింగ్ కార్డు కోసం రూ.200 చొప్పున స్వీకరించామన్నారు. కమిటీకి ముఖ్య సభ్యులుగా దక్షిణ ఎమ్మెల్యే సీహెచ్.వంశీకృష్ణ శ్రీనివాస్, జోనల్ అధికారులు, లా అండ్ ఆర్డర్, ట్రాఫిఫ్ సీఐ , ఇండియన్ బ్యాంకు మేనేజర్, ఓరియంటల్ ఇన్సూరెన్స్ కంపెనీ సిబ్బంది, ఇద్దరు ఎస్ఎల్ఎఫ్ మెంబర్లు శాశ్వత సభ్యులుగా ఉంటారన్నారు. అనంతరం జోనల్ వెండింగ్ కమిటీ సభ్యులకు నియామక పత్రాలను అందజేశారు.

మాదక ద్రవ్యాల నిరోధక ర్యాలీ


ర్యాలీ చేస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

అక్కయ్యపాలెం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మాదక ద్రవ్యాల నివారణ దినోత్సవం సందర్భంగా ఎన్‌జీజీఓస్ కాలనీలోని జీవీఎంసీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని జయంతి రాధాకుమారి ఆధ్వర్యంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు ర్యాలీ నిర్వహించారు. పాఠశాలలో 8, 9, 10 చదువుతున్న విద్యార్థులు మాదక ద్రవ్యాల వల్ల కలిగే నష్టాలను నినాదాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సునీత, గ్లోరీ, నిర్మల, రమణి, రత్నం, జ్యోతి, ఎన్‌సీసీ అధికారి ఎంఎస్‌వీ విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్‌లో 8.1 కేజీల గంజాయి పట్టివేత

విశాఖపట్నం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): రైల్లో గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తిని పట్టుకుని 8.1 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు పోలీసులు తెలిపారు. ఆర్‌పీఎఫ్, జీఆర్పీ సిబ్బంది ప్లాట్‌ఫామ్‌లపై తనిఖీ చేస్తుండగా కర్ణాటకకు చెందిన మంజునాథ్ గంజాయి సంచులను మైసూరుకు రవాణా చేస్తూ పట్టుబడ్డాడు. అతడిపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించారు.

వారాహి అమ్మవారి నవరాత్రులు ప్రారంభం


అమ్మవారికి హారతి ఇస్తున్న ఎంపీ శ్రీభరత్

మహారాణిపేట, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): పాత నగరం చిలకపేటలో శ్రీవారాహి అమ్మవారి నవరాత్రులు గురువారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా విగ్రహ ప్రతిష్ఠ, యాగం నిర్వహించారు. ఎంపీ ఎం.శ్రీభరత్, దక్షిణ, తూర్పు ఎమ్మెల్యేలు వంశీకృష్ణ శ్రీనివాస్, వెలగపూడి రామకృష్ణబాబు, మేయర్ పీలా శ్రీనివాసరావు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జి, మహ్మద్ సాదిక్ తదితరులు పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అర్చకులు మాట్లాడుతూ మొదటి సారిగా విగ్రహ ప్రతిష్ఠాపన యాగం నిర్వహించామని, వచ్చేనెల 4వ తేదీ వరకు ఉత్సవాలు జరుగుతాయన్నారు. ప్రతి రోజు గణపతి పూజ, పుణ్యాహవచనం, నవగ్రహ మండపార్చన గోపూజ, వారాహి అమ్మవారికి పంచామృతాభిషేకం, మహిళలతో కోటి కుంకుమార్చన, వారాహి, చండీ లక్ష్మీ గణపతి, నవగ్రహ మృత్యుంజయ హోమాలు నిర్వహిస్తామన్నారు.

కొత్తవలస రైల్వే స్టేషన్‌లో టికెట్ తనిఖీలు

- 2,030 మంది నుంచి రూ.12 లక్షల జరిమానా


కొత్తవలస రైల్వే స్టేషన్‌లో చెకింగ్ అధికారులు

విశాఖపట్నం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): టికెట్ లేని ప్రయాణాన్ని నియంత్రించడంతో పాటు ప్రయాణికుల భద్రత, సురక్షితమైన ప్రయాణం అందించడంలో భాగంగా వాల్తేరు డివిజన్ పరిధిలోని కొత్తవలస రైల్వే స్టేషన్‌లో గురువారం టికెట్ తనిఖీలు చేపట్టారు. కమర్షియల్ విభాగం, ఆర్పీఎఫ్ సిబ్బంది సమన్వయంతో చేపట్టిన ప్రత్యేక డ్రైవ్‌లో టికెట్ లేకుండా ప్రయాణిస్తున్నవారితోపాటు పార్శిల్ బుకింగ్ ద్వారా తీసుకువెళ్లాల్సిన లగేజిని కోచ్‌లో తీసుకువెళుతున్నవారిపై 2,030 కేసులు నమోదు చేసి వారి నుంచి సుమారు రూ.12 లక్షలు జరిమానా వసూలు చేసినట్టు సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఒకేరోజులో అత్యధిక కేసులు నమోదు చేయడంతోపాటు సుమారు రూ.12 లక్షలు జరిమానా వసూలు చేయడం ఇదే ప్రథమమన్నారు. సురక్షిత ప్రయాణ పద్ధతులు పాటించాలని, తప్పనిసరిగా టికెట్ తీసుకోవాలని, రైలు ఎక్కే, దిగే సమయంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ టోర్నీకి జిల్లా జట్టు


రాష్ట్ర స్థాయికి ఎంపికైన ఫుట్ బాల్ జట్టు క్రీడాకారులు

విశాఖపట్నం, స్పోర్ట్స్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి):రాష్ట్ర స్థాయి అండర్-14 బాలుర ఫుట్‌బాల్ టోర్నీలో పాల్గొనే జిల్లా జట్టును గురువారం ప్రకటించారు. మదనపల్లిలో ఈనెల 29 నుంచి జరగనున్న టోర్నీకి 22 మంది సభ్యులతో జిల్లా జట్టును ప్రకటించారు. వీరేంద్ర, డబ్ల్యు మహేష్, సీహెచ్ అశ్వంత్, బి.కార్తీక్, ఎం.లోహిత్, ఎస్.సంతోష్, ఎం.రాహుల్, వి.సాత్విక్, సీహెచ్.ప్రణదీప్, బి.ప్రజ్వాల్, సీహెచ్.లోహన్ కాంత్, బెంజిమన్, ఎ.వివేక్, జె.ప్రవీణ్, వై.హరీష్, పి.ధనుష్ యాదవ్, సాయివిదేష్, ఎల్.రఘువీర్, కె.భగేష్, అప్రూవ చెరబ్, బి.చరణ్, కె.తేజసాయి స్వరూప్ ఎంపికయ్యారు. కోచ్‌లుగా గోపాలకృష్ణ, అజీజ్, మేనేజర్‌గా త్రినాథరావు వ్యవహరిస్తారు.

ప్రజలను రెచ్చగొట్టేలా బీజేపీ అజెండా

- సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ రాష్ట్ర అధికార ప్రతినిధి ప్రసాద్


సమావేశంలో మాట్లాడుతున్న ప్రసాద్

సీతంపేట, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): దేశంలో ఏం జరిగినా ముస్లింలే కారణమని బీజేపీ నేతలు ప్రచారం చేస్తున్నారని సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ రాష్ట్ర అధికార ప్రతినిధి పి.ప్రసాద్ పేర్కొన్నారు. విశాఖ పౌరగ్రంథాలయంలో న్యూడెమోక్రసీ విశాఖ, విజయనగరం జిల్లాల ప్రాంత కమిటీ ఆధ్వర్యంలో ఎమర్జెన్సీ డే సందర్భంగా కార్పొరేట్ ఫాసిజానికి వ్యతిరేకంగా గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలో రాజకీయ నియతృత్వంతో పాటు సాంస్కృతిక ఆర్ఎస్ఎస్ ఆర్మీ ఉందని, ఆదివాసీలు, దళితులు, మైనారిటీలను శత్రువులుగా చిత్రీకరించేలా ప్రమాదకర ఎజెండాను బీజేపీ అనుసరిస్తోందని ఆరోపించారు. అంబానీ, అదానీల కార్పొరేట్ ముఠా మోదీని శాసిస్తోందన్నారు. కశ్మీర్‌లో జరిగే నరమేధాన్ని బయటకు తెలియనీయడం లేదన్నారు. మోదీని బీజేపీ, ఆర్ఎస్ఎస్ నడుపుతుండగా కార్పొరేట్ వర్గాలు పోషిస్తున్నాయన్నారు. మానవ హక్కుల వేదిక తెలుగు రాష్ట్రాల సమన్వయకర్త వీఎస్ కృష్ణ మాట్లాడుతూ గతంలోని ఎమర్జెన్సీ కన్నా ప్రస్తుత అనధికార ఎమర్జెన్సీ చాలా ప్రమాదమన్నారు. సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ విశాఖ, విజయనగరం జిల్లాల ఏరియా కమిటీ కార్యదర్శి ఎం.వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో భానాస రాష్ట్ర అధ్యక్షులు టి.శ్రీరామమూర్తి, రాజకీయ ఖైదీల విడుదల కమిటీ ప్రతినిధి కె.పద్మ, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య కళాకారుల బృందం సభ్యులు పాల్గొన్నారు.

నేడు ఈపీడీసీఎల్ సూపర్ ఈసీబీసీ భవనం ప్రారంభం

హాజరుకానున్న విద్యుత్ శాఖా మంత్రి గొట్టిపాటి, ప్రధాన కార్యదర్శి విజయానంద్


ఈపీడీసీఎల్ సూపర్ ఈసీబీసీ భవనం

విశాఖపట్నం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విద్యుత్ శాఖా మంత్రి గొట్టిపాటి రవికుమార్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, విద్యుత్ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ విజయానంద్ శుక్రవారం విశాఖపట్నం వస్తున్నారు. సాగర్‌నగర్‌లో నిర్మించిన సూపర్ ఎనర్జీ కన్జర్వేషన్ బిల్డింగ్ కోడ్ (ఈసీబీసీ) భవనాన్ని వారు ప్రారంభిస్తారని ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ గురువారం తెలిపారు. సుమారు రూ.14 కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ భవనానికి కేంద్ర ప్రభుత్వ సంస్థ 'బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియెన్సీ' రూ.5 కోట్లు ప్రోత్సాహకంగా ఇచ్చిందన్నారు. ఈ భవనం విద్యుత్ బిల్లుల భారాన్ని గణనీయంగా తగ్గిస్తుందన్నారు. ఈపీడీసీఎల్ పరిధిలోని 11 జిల్లాల ఉద్యోగులకు శిక్షణ కోసం ఈ భవనం నిర్మించామన్నారు. జూనియర్ లైన్‌మెన్ నుంచి పైస్థాయి ఉద్యోగులకు శిక్షణ కార్యక్రమాలు ఇక్కడ నిర్వహిస్తామన్నారు. విశాఖపట్నం సాగరతీరంలో 24 సబ్‌స్టేషన్లను ఆటో స్విచ్చింగ్ సబ్ స్టేషన్లుగా మార్చి పెదవాల్తేరులో అనుసంధానం చేసిన స్కాడా భవనాన్ని కూడా మంత్రి రవికుమార్ సందర్శిస్తారన్నారు. సంస్థలో పనిచేస్తూ చనిపోయిన 19 మంది ఉద్యోగుల వారసులకు కారుణ్య నియామకం పత్రాలు అందిస్తారని వివరించారు.

టీటీ క్రీడాకారులకు ప్రోత్సాహకాలు



చెక్కులు అందుకున్న క్రీడాకారులతో ఎమ్మెల్యే గణబాబు

విశాఖపట్నం, స్పోర్ట్స్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ, జాతీయ టేబుల్ టెన్నిస్ టోర్నీల్లో సత్తా చాటుతున్న నగర క్రీడాకారులకు జిల్లా టేబుల్ టెన్నిస్ సంఘం నగదు ప్రోత్సాహక బహుమతులు అందజేసింది. ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ గణబాబు ముఖ్య అతిథిగా హాజరై క్రీడాకారులకు చెక్కులు అందజేశారు. టేబుల్ టెన్నిస్‌లో రాణిస్తున్న క్రీడాకారులను ప్రోత్సహిస్తున్న జిల్లా సంఘం ప్రతినిధులను అభినందించారు. పి.మహీదర్ వర్మ, పీవీ మణికుమార్, వి.గుణ సంయుక్త, వి.హార్దిక్‌రామ్, రేణుక సత్య, డి.దీక్షిత, సాయిచరణ్, ఆరిఫా సుల్తాన్, ఎం.ప్రజ్ఞాన్‌లు ప్రోత్సాహకాలు అందుకున్నారని సంఘం ప్రతినిధులు డాక్టర్ దీవీఎస్‌వైశర్మ, మురళీపాత్రో తెలిపారు.

పలు రైళ్లకు తాత్కాలిక అదనపు కోచ్‌లు

విశాఖపట్నం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని పలు రైళ్లకు తాత్కాలిక అదనపు కోచ్‌లు జత చేస్తున్నామని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. పూరి-యశ్వంతపూర్-పూరి గరీబ్‌రథ్‌కు జూలై నాలుగు నుంచి 26 వరకు థర్డ్ ఏసీ ఎకానమీ కోచ్, సంబల్‌పూర్-నాందేడు-సంబల్‌పూర్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌కు జూలై నాలుగు నుంచి 29 వరకు థర్డ్ ఏసీ, స్లీపర్ కోచ్, విశాఖ-గుణుపూర్- విశాఖ పాసింజర్‌కు జూలై ఒకటి నుంచి 31 వరకు స్లీపర్ క్లాసు, విశాఖ-కిరండూల్-విశాఖ పాసింజర్‌కు జూలై ఒకటి ఆగస్టు ఒకటి వరకు స్లీపర్ కోచ్, విశాఖ-తిరుపతి-విశాఖ ప్రత్యేక రైళ్లకు జూలై రెండు నుంచి 31 వరకు థర్డ్ ఏసీ ఎకానమీ కోచ్, విశాఖ- చర్లపల్లి-విశాఖ ప్రత్యేక ఎక్స్‌ప్రెస్‌కు జూలై నాలుగు నుంచి 26 వరకు థర్డ్ ఏసీ, భువనేశ్వర్-జునాగర్-భువనేశ్వర్‌కు జూలై ఒకటి నుంచి ఆగస్టు ఒకటి వరకు స్లీపర్ క్లాసు కోచ్‌లు జత చేస్తున్నామన్నారు.

ఐటీ కంపెనీల దాగుడుమూతలు

... 5వ పేజీ తరువాయి

తరువాత అన్నమాట. ఏడాదిలోగా ఎక్కడో ఒక భవనం తీసుకొని అందులో కొంతమందితో కంపెనీని ప్రారంభించి, ఆ తరువాత సొంత భవనంలోకి మారి పూర్తిస్థాయిలో విస్తరించవచ్చు. ఆ విధంగా ప్రభుత్వం కూడా ఒప్పించాలి. 2029 ఎన్నికల సంవత్సరం. ఒకవేళ అప్పటికి ఉద్యోగాలు ఇవ్వకపోతే ప్రభుత్వ లక్ష్యం నెరవేరే అవకాశం లేదు. దీనిపై పునరాలోచన చేయాల్సి ఉంది.

గుర్రపు స్వారీకి 3 కోట్లు ధారాదత్తం!

... 5వ పేజీ తరువాయి

అభ్యంతరం చెప్పడంతో ప్రాజెక్టును నిలిపివేసింది. అయితే అందుకోసం వెచ్చించిన రూ.3 కోట్ల ప్రజా ధనాన్ని బాధ్యులైన వారి నుంచి రికవరీ చేయాలనే డిమాండ్ వినిపిస్తోంది. అప్పటి కమిషనర్ సాయికాంత్‌వర్మ నుంచి ఆ నిధులను రికవరీ చేయాలని కొందరు, మేయర్ నుంచి వసూలు చేయాలని మరికొందరు డిమాండ్ చేస్తున్నారు. ఏదిఏమైనా భవిష్యత్తులోనైనా ప్రజాధనం దుర్వినియోగం చేయకుండా అడ్డుకట్టవేయాలంటే చట్ట ప్రకారం అనుసరించాల్సిన ప్రక్రియను పక్కనపెట్టి గుర్రపు స్వారీ కోసం డబ్బును దుర్వినియోగం చేసిన వారి నుంచి రికవరీ చేయాల్సిన అవసరం ఉందని కార్పొరేటర్లు సైతం అభిప్రాయపడుతున్నారు.

బియ్యం ఎగుమతులపై నిఘా

... 5వ పేజీ తరువాయి

తీసుకువస్తే వెంటనే నిర్ధారించవచ్చు. అదే ఛత్తీస్‌గఢ్‌లో కొన్ని జిల్లాల్లో ఫోర్టిఫైడ్ రైస్‌ను, మరికొన్ని జిల్లాల్లో సాధారణ బియ్యం అందిస్తున్నారు. సాధారణ బియ్యం రేషన్ దుకాణాల ద్వారా పంపిణీ చేసిందో, కాదో...నిర్ధారించడం వెంటనే సాధ్యంకాదని అధికారులు చెబుతున్నారు. వాటిని లేబొరేటరీకి పంపితే కొంతవరకూ గుర్తించవచ్చునంటున్నారు. ఈ నేపథ్యంలో విశాఖ పోర్టు పరిధిలోనే బియ్యం టెస్టింగ్ లేబొరేటరీ ఒకటి ఏర్పాటుచేయాలని యోచిస్తున్నారు. పోర్టు నుంచి రేషన్ బియ్యం రవాణాను పూర్తిగా అరికట్టేలా నిఘా ముమ్మరం చేస్తామని జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ తెలిపారు. త్వరలో టాస్క్‌ఫోర్స్ ఏర్పాటుచేసి పోర్టు నుంచి రేషన్ బియ్యం ఎగుమతులకు అడ్డుకట్ట వేస్తామన్నారు.

హైవే మరమ్మతుల్లో నాణ్యతాలోపం

... 5వ పేజీ తరువాయి

రాళ్లు పైకి తేలాయి. చాలాచోట్ల రహదారి అంచులు కూడా సరిగా కలపలేదు. దీంతో వాహన చోదకులు ఇబ్బందిపడుతున్నారు. ఇక, కొన్నిచోట్ల పనులు చేపట్టకుండానే వదిలేశారు. వాహనాలు పార్కింగ్ చేసి ఉంటే వాటిని తీయించి అక్కడ పనులు చేపట్టాల్సిన బాధ్యత కాంట్రాక్ట్ సంస్థదే. అయితే, అందుకు విరుద్ధంగా వాహనాలు పార్కింగ్ చేసి ఉంటే ఆయా ప్రాంతాలను వదిలేసి ముందుకు వెళ్లిపోయారు. దీంతో అటువంటిచోట్ల రహదారి దారుణంగా కనిపిస్తోంది. పనులను పర్యవేక్షించాల్సిన అధికార యంత్రాంగం పట్టించుకోక పోవడమే పనులు నాసిరకంగా ఉండడానికి కారణమన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ఈ పనులపై దృష్టిసారించాలని నగరవాసులు కోరుతున్నారు.

నేడు బ్లాస్ట్ ఫర్నేస్-3 ప్రారంభం

... 5వ పేజీ తరువాయి

సిలికాతో కూడిన హాట్ మెటల్ వస్తుంది. దాని తరువాత జూలై పదో తేదీ నుంచి అసలైన హాట్ మెటల్ ఉత్పత్తి అవుతుంది. ఇందులో నుంచి రోజుకు ఏడు వేల టన్నుల ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. మిగిలిన రెండు బ్లాస్ట్ ఫర్నేస్‌ల ద్వారా ప్రస్తుతం 14వేల టన్నులు వస్తోంది. మూడు బ్లాస్ట్ ఫర్నేస్‌లకు అవసరమైన ముడి పదార్థాలను నిరంతర సరఫరా చేస్తే రోజుకు 21 వేల టన్నుల ఉత్పత్తి జరుగుతుంది. అలా ఆరు నెలలు చేస్తే ప్లాంటును నష్టాల నుంచి లాభాల బాటలోకి తీసుకురావచ్చునని యాజమాన్యం చెబుతోంది.

నేటి నుంచి అవుట్‌సోర్సింగ్ కార్మికుల సమ్మె

... 5వ పేజీ తరువాయి

విధానంలో పనిచేస్తున్న కార్మికుల్లో పదేళ్ల అనుభవం కలిగివుండి టెక్నికల్ విధులు నిర్వర్తిస్తున్న దాదాపు 900 మందిని సెమీ స్కిల్డ్ కేటగిరీలో చేర్చి, ఆ మేరకు వేతనాలు ఇవ్వాలని కార్మిక సంఘాలు చాలాకాలంగా డిమాండ్ చేస్తున్నాయి. గత ఏడాది డిసెంబరులో జరిగిన కౌన్సిల్ సమావేశంలో వేతనాల పెంపునకు ఆమోదం తెలిపారు. ఈ మేరకు అధికారులు ప్రతిపాదనలు తయారుచేసి దాదాపు 900 మందికి రూ.6 వేలు చొప్పున మే నెల నుంచి జీతం పెంచుతూ ఆప్కోస్ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేశారు. కానీ పలు కారణాలతో పాత వేతనాలనే చెల్లించారు. దీనిపై జీవీఎంసీలోని అన్ని కార్మిక సంఘాలు ఈనెల 11 నుంచి నిరవధిక సమ్మెలోకి దిగుతున్నట్టు ప్రకటించాయి. నగరంలో నీటి సరఫరా నిలిచిపోతుందని భావించిన అధికారులు, మేయర్ పీలా శ్రీనివాసరావు...కార్మిక సంఘాల నేతలతో చర్చలు జరిపారు. పదిహేను రోజులు సమయం ఇస్తే కొత్త వేతనాలను అమలు చేస్తామని హామీ ఇచ్చారు. అయితే జూన్ నెలకు సంబంధించిన జీతాల చెల్లింపునకు పాతపద్ధతిలోనే వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయడంతో అధికారులు, మేయర్ మాట తప్పారని ఆరోపిస్తూ గురువారం అర్ధరాత్రి తర్వాత విధులను బహిష్కరించి సమ్మెకు దిగాలని కార్మిక సంఘాల నేతలు నిర్ణయించారు. కార్మికులు సమ్మెకు దిగితే శుక్రవారం నగరంలో నీటి సరఫరాకు అంతరాయం కలిగే అవకాశం ఉంది.

నేడు స్టాండింగ్ కమిటీ సమావేశం

... 5వ పేజీ తరువాయి

ఆశీలు వసూలుపై సమావేశంలో వాడీవేడి చర్చ జరిగే అవకాశం ఉంది. స్టాండింగ్ కమిటీ ఆమోదం తర్వాత ఆశీలు వసూలు బాధ్యతలను కాంట్రాక్టర్లకు అప్పగించాలి. అప్పటివరకూ రెవెన్యూ విభాగం సిబ్బంది ద్వారా వసూలు చేయించి, ఆ మొత్తాన్ని ప్రతిరోజూ సౌకర్యం కేంద్రంలో జమ చేయాలి. కానీ స్టాండింగ్ కమిటీ అనుమతి లేకపోయినా, వర్క్ ఆర్డర్‌ను అధికారులు అందజేయకపోయినా వేలంలో పాట దక్కించుకున్నవారు ఏప్రిల్ ఒకటి నుంచే ఆశీలు వసూలు చేసుకుంటున్నారు. గెజిట్ కంటే నాలుగైదు రెట్లు ఎక్కువ వసూలుచేసి, అధికారులకు వాటాలు ఇచ్చి నామమాత్రపు మొత్తాన్ని జీవీఎంసీకి జమ చేస్తున్నారు. దీనిపై స్టాండింగ్ కమిటీ సభ్యులు పూర్తి ఆధారాలు సంపాదించడంతో అధికారులను నిలదీసే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది.



ఎమ్మెల్యేతో మాట్లాడుతున్న ప్రతినిధులు

పోర్టు స్థలాన్ని స్థానికులకే కేటాయించాలని ఎమ్మెల్యేకు వినతి

మల్కాపురం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మల్కాపురం ఎస్సీ కాలనీ, గాంధీజీ వీధికి ఆనుకుని ఉన్న పోర్టు స్థలం స్థానికులకే ఉపయోగపడేలా చూడాలని కోరుతూ పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబుకు గ్రామ సంక్షేమ సంఘం ప్రతినిధులు గురువారం వినతిపత్రం అందజేశారు. గ్రామస్థుల డిమాండ్‌ను కాదని ఏదైనా సంస్థకు ఈ స్థలాన్ని కేటాయిస్తే తాము ఆందోళనకు దిగుతామన్నారు. గతంలో ఇచ్చిన హామీ మేరకు ఈ స్థలాన్ని మైదానంగా తీర్చిదిద్దాలని లేదా ఇండోర్ స్టేడియం కానీ పార్కు, కల్యాణ మండపాన్ని నిర్మించాలని వారు కోరారు. ఇటీవల ఈ స్థలాన్ని కోస్టు గార్డు అధికారులు పరిశీలించి వెళ్లారని వివరించారు. దీనిపై కలెక్టర్‌తో మాట్లాడి గ్రామస్థులకు న్యాయం జరిగేలా చూస్తానని గణబాబు హామీ ఇచ్చినట్టు గ్రామ పెద్దలు తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో గ్రామ కమిటీ ప్రతినిధులు భోగవిల్లి నాగభూషణం, సత్యాల మహేశ్, నూనెల శ్రీను, ఎం.రమేశ్, పి.పెంటారావు, తదితరులు ఉన్నారు.

రామాలయ వార్షికోత్సవం

అగనంపూడి, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): పాత అగనంపూడిలో గల కోదండ రామాలయ 50వ వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ప్రతినిధులు సీతారామలక్ష్మణలకు పట్టు వస్త్రాలతో ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి సీతారాములను దర్శించుకున్నారు. కార్పొరేటర్లు రౌతు శ్రీనివాస్, ఇల్లపు వరలక్ష్మీ ప్రసాద్ పూజలు చేశారు. మధ్యాహ్నం అన్న సమారాధనను చేపట్టారు. సాయంత్రం పల్లకీ సేవ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త కొయ్య వెంకటరమణారెడ్డి, స్థానిక నాయకులు బి.నాగేశ్వరరావు, గల్లా రాజు, ఎం.నరసింగరావు, జి.శ్రీను, సమర, ఎం.శ్రీను, కె.సత్యారావు, పైడిరాజు, తదితరులు పాల్గొన్నారు.

‘ఉక్కు నిర్వాసితులకు శాశ్వత పరిష్కారం చూపాలి’

ఉక్కుటౌన్‌షిప్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ఉక్కు నిర్వాసిత నిరుద్యోగులకు శాశ్వత పరిష్కారం చూపాలని నిర్వాసిత సంఘ నాయకులు డిమాండ్ చేశారు. టౌన్‌షిప్‌లో నిర్వాసిత నాయకులు గురువారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఉక్కు కర్మాగారం కోసం సర్వం త్యాగం చేసిన నిర్వాసితులకు ఉపాధి కల్పించలేదన్నారు. ఇటీవల కాలంలో నిర్వాసిత కాంట్రాక్టు కార్మికులను కూడా యాజమాన్యం తొలగించడం దారుణమన్నారు. నిర్వాసితులకు వన్‌టైమ్ సెటిల్‌మెంట్ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు పి.భాస్కరరావు, ఉమ్మడి అప్పారావు, సోంబాబు, అప్పలరెడ్డి, వెంకటేశ్, చిన్న, సన్యాసిరావు, తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **కన్నప్ప** : జగదాంబ, కిన్నెర, శ్రీకన్య, లీలామహల్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), నటరాజ్ (పెందుర్తి). లిఖిత (శ్రీహరిపురం), అరుణ (పెదగంట్యాడ),
- **కుబేర** : మెలోడి, సంగం, శ్రీరామా, కామేశ్వరి, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), సుకన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **ఎఫ్.1** : రమాదేవి, జగదాంబ,
- **మార్గన్ :** శారద, శరత్, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక), రమాదేవి,
- **8 వసంతాలు** : శ్రీ వెంకటేశ్వర, కన్య హెవెన్ (గాజువాక).

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 23, టమాటా 26, వంకాయలు (తెలుపు) 26, వంకాయలు (నలుపు) 26, బెండకాయలు 28, పచ్చిమిర్చి 50, కాకరకాయలు 40, బీరకాయలు 34, ఆనపకాయ 16, కాలీఫ్లవర్ 40, క్యాబేజి 18, క్యారెట్ 38, దొండకాయలు 30, బంగాళ దుంపలు 18, అరటికాయ (పె)10, మునక్కాడలు (కిలో) 94, అల్లం (పాతది)50, బరబాటి 34, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 60, బద్దచిక్కుడు 50, దోస కాయలు 16, వెల్లుల్లి (పెద్దవి) 100, కొబ్బరికాయ (పెద్దది) 24, బీన్స్ (పెన్సిల్) 110, కీరదోస 32, కాప్సికమ్ 76, పొట్లకాయ (పెద్దది) 40, చేమదుంపలు 36, చిలగడదుంపలు 30, కంద 52, దేముడు చిక్కుడు 56, గోరు చిక్కుడు 40, కూర పెండలం 26, బ్రకోలి 45 , నూల్‌కోల్ 34, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 4 , చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 20, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 18, మామిడి అల్లం 56, బొప్పాయి 30, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్)
(వంద - రూ.లలో)

విశాఖపట్నం	575
విజయనగరం	579
శ్రీకాకుళం	579

చికెన్ ధరలు
బ్యాగ్

రైతు ధర	85
లైవ్ ధర	105
విత్ స్కిన్	180
స్కిన్‌లెస్	190

ఇళ్ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలి

» ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు

పెందుర్తి, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆకాంక్షల మేరకు ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు ఆదేశించారు. సుజాతనగర్‌లోని తన క్యాంపు కార్యాలయంలో గురువారం ఆయన గృహ నిర్మాణశాఖ అధికారులతో సమావేశమయ్యారు. నియోజకవర్గంలో ఇప్పటివరకు చేపట్టిన గృహ నిర్మాణాల పురోగతిపై సమీక్షించారు. కాంట్రాక్టర్లు, లబ్ధిదారులతో మాట్లాడి ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు.

నియోజకవర్గంలో వివిధ దశల్లో ఉన్న 11,200 ఇళ్ల నిర్మాణాల్లో పురోగతి సాధించాలని పంచకర్ల పేర్కొన్నారు. పెందుర్తి అర్బన్‌లో 6,339 గృహాలకు గాను



అధికారులతో మాట్లాడుతున్న పంచకర్ల రమేశ్‌బాబు

శ్లాబ్ లెవెల్ వరకు కేవలం 1,500 మాత్రమే నిర్మాణం జరగడంపై ఎమ్మెల్యే ఆరా తీశారు. నిర్మాణాల అలసత్వానికి గల కారణాలను శాఖాపరంగా విశ్లేషించారు. ఇళ్ల నిర్మాణాల్లో అక్రమార్కులను ప్రోత్సహించరాదని, నాణ్యతతో పనులను పూర్తి చేయాలని సూచించారు. అలాగే పెందుర్తి, సబ్బవరం, పరవాడ మండలాలకు కేటాయించిన 4,861 ఇళ్లల్లో 2,600 పూర్తి కావడం, వంద శాతం లక్ష్యం చేరుకోకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు లబ్ధిదారులు, కాంట్రాక్టరుతో అధికారులు సమన్వయం కావాలని పేర్కొన్నారు. సమావేశంలో హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ సత్తిబాబు, ఈఈ శ్రీనివాసరావు, డీఈ సూర్యారావు, ఏఈ దీపక్, తదితరులు పాల్గొన్నారు.

సీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ ఏర్పాటుకు చర్యలు

అనంతరం ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు పెందుర్తి సీహెచ్‌సీ వైద్య సిబ్బందితో సమావేశమయ్యారు. ఆస్పత్రిలో మౌలిక సదుపాయాలపై సమీక్షించారు. సీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ ఏర్పాటుకు చర్యలు చేపట్టనున్నామని, ఇందుకు సంబంధించి కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని సూచించారు. ఆస్పత్రి వైద్యాధికారి దొర, అవంతి, అరుణ పాల్గొన్నారు.

నేటి నుంచి జగన్నాథస్వామి రథోత్సవాలు

ఉక్కుటౌన్‌షిప్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): స్టీల్ ప్లాంట్ జగన్నాథస్వామి ఆలయంలో శుక్రవారం నుంచి రథోత్సవాలను వైభవంగా నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. తొమ్మిది రోజుల పాటు జగన్నాథ, బలభద్ర, సుభద్రలకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరుపుతామన్నారు. పూరీలో మాదిరిగానే ఇక్కడ కూడా పూజాది కార్యక్రమాలను చేపడతామని పేర్కొన్నారు. స్వామివారిని దర్శించేందుకు వచ్చే భక్తులు ఇబ్బందులు పడకుండా తగిన ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

అగనంపూడి: అగనంపూడితో పాటు ఉక్కు నిర్వాసిత కాలనీలు, పరిసర ప్రాంతాల ప్రజలు తమ ఆరాధ్య దైవంగా భావించే జగన్నాథస్వామి రథయాత్రను స్థానిక ఆలయం వద్ద శుక్రవారం ఘనంగా నిర్వహించేందుకు దేవదాయశాఖాధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. తొలిరోజు రథయాత్రలో అధిక సంఖ్యలో భక్తులు రథాన్ని లాగడానికి తరలివచ్చే అవకాశం ఉన్నందున తగిన చర్యలు చేపట్టారు. ఉదయం ఒడిశా సంప్రదాయం ప్రకారం సుభద్ర, బలభద్ర సమేత జగ



అగనంపూడిలో సిద్ధం చేసిన రథం

న్నాథస్వామికి ప్రత్యేక పూజలు చేశాక భక్తులకు దర్శన భాగ్యం కల్పిస్తారు. సాయంత్రం ఉత్సవమూర్తులను ప్రత్యేక పుష్పాలతో అలంకరించి రథంపై ఆశీనులను చేసి రథయాత్రను ప్రారంభిస్తారు. స్థానిక కూడలి నుంచి జాతీయ రహదారి మీదుగా ఇంద్రజుమ్ని మందిరం వరకు యాత్ర సాగుతుంది. ఇక్కడ స్వామి వారిని పది రోజుల పాటు ఉంచి వివిధ అవతారాల్లో అలంకరించి పూజలు చేశారు. జూలై 1న హేరా పంచమి సందర్భంగా లక్ష్మీదేవికి ప్రత్యేక కుంకుమ పూజలు చేస్తారు. అలాగే 6న స్వామివారి తిరుగు రథ యాత్రను నిర్వహించి ఆలయంలో ప్రత్యేక పూజలు జరుపుతామని ఆలయ కార్యనిర్వహణాధికారి పద్మావతి తెలిపారు.

గవరపాలెంలో ఉత్సవాలు ప్రారంభం

పెందుర్తి-రూరల్: గ్రేటర్ 95వ వార్డు పరిధి చింతల అగ్రహారం గవరపాలెంలోని శ్రీగీతాకృష్ణ ఆలయంలో జగన్నాథసామి రథయాత్ర ఉత్సవాలను గురువారం ఘనంగా ప్రారంభించారు. తొలిరోజు ఉదయం స్వామివారి సుప్రభాత సేవ, మంగళహారతి, తులసీ హారతి వంటి పూజాది కార్యక్రమాలను చేపట్టారు. గణపతి పూజ అనంతరం కళాన్యాస హోమం జరిపారు. సాయంత్రం రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాల స్వామికి శాంతి కల్యాణాన్ని నిర్వహించారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ

పీవీ చలపతిరావు సేవలు చిరస్మరణీయం

» కేంద్ర ఉక్కుశాఖ సహాయ మంత్రి శ్రీనివాస వర్మ

విశాఖపట్నం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్సీ పీవీ చలపతిరావు అందించిన సేవలు ఈ రాష్ట్ర రాజకీయ రంగానికే కాకుండా, దేశాభివృద్ధికి కూడా ఎంతో తోడ్పడ్డాయని కేంద్ర ఉక్కు శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ అన్నారు. ఎంవీపీ కాలనీలోని ఐఏఎం ఆడిటోరియంలో గురువారం పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ ప్రతిపాదించిన అఖండ మానవతావాదం సిద్ధాంతానికి అరవై వసంతాలు పూర్తి అనే అంశంపై ప్రత్యేక సెమినార్‌ను, పీవీ చలపతిరావు 91వ జయంతి కార్యక్రమాలను ఢిల్లీకి చెందిన రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఫౌండేషన్ ఫర్ ఇంటిగ్రల్ హ్యూమనిజం, పీవీ చలపతిరావు ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఎమర్జెన్సీ కాలం 22 నెలల్లో పీవీ చలపతిరావు 19 నెలల 19 రోజులు అజ్ఞాతంలో గడిపారన్నారు. పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ ప్రతిపాదించిన అఖండ మానవతావాదం భారతీయ తత్వశాస్త్రం, సంస్కృతికి సమగ్ర దృక్పథాన్ని అందించిందన్నారు. ఆంధ్రప్రదేశ్ ఆర్‌ఎస్‌ఎస్ క్షేత్ర ప్రచారక్ భరత్ కుమార్ మాట్లాడుతూ భారతీయ సంప్రదాయాలను ఆధారంగా చేసుకుని పండిట్ జీ ప్రతిపాదించిన ఈ తత్వం సామాజిక న్యాయం, ఆర్థిక స్వావలంబన, సంస్కృతికి గౌరవం కోసం ఒక బలమైన మానవ కేంద్రిత మౌళిక దృక్పథం అన్నారు. మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్ సభాధ్యక్షత వహించారు. కార్యక్రమంలో మళ్ల సాంబశివ, సత్యారావు మాస్టర్, నారాయణరావు, పరశురామరాజు, సుబ్బిరామిరెడ్డి, కొప్పిశెట్టి మాధురి, భాజపా, ఆర్ ఎస్ ఎస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

నేటి నుంచి విద్యుత్ ట్రాన్స్‌మిషన్ పనులు

జూలై 31 వరకు అత్యవసర సమయాల్లో సరఫరాకు అంతరాయం

గాజువాక, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): గాజువాక-గంగవరం విద్యుత్ ట్రాన్స్‌మిషన్ లైన్ ఆధునికీకరణ పనుల్లో భాగంగా అత్యవసర పరిస్థితి వస్తే విద్యుత్ సరఫరాకు అంతరాయం వాటిల్లుతుందని ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి.శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం నుంచి జూలై 31వ తేదీ వరకు ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు సాంకేతిక మరమ్మతు పనులు చేపట్టనున్నామన్నారు. ఈ కారణంగా సాధారణ ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశామన్నారు. అత్యవసర పరిస్థితి ఏర్పడితే మాత్రం గాజువాక, మల్కాపురం, కేవీ, నేవల్ వార్ఫ్, పోర్టు ఉప కేంద్రాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగే అవకాశం ఉందన్నారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించి తమకు సహకరించాలని కోరారు. .

ఏపీపీజీఈసెట్ ర్యాంకరుకు సత్కారం



సునీల్‌కు ప్రోత్సాహక బహుమతిగా నగదును అందజేస్తున్న ఎంపీపీ నాగమణి

పెందుర్తి, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ఏపీపీజీఈసెట్‌లో కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ (సీఎస్ఈ) విభాగంలో రాష్ట్ర స్థాయిలో ప్రథమ ర్యాంకు సాధించిన మండలంలోని ఎస్‌ఆర్‌పురం గ్రామానికి చెందిన బాలిబాని సునీల్‌ను గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మధుపాడ నాగమణి ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి జడ్పీ సీఈవో నారాయణమూర్తి, డీపీవో శ్రీనివాసరావు హాజరై సునీల్‌కు దుశ్శాలువా కప్పి, పూలమాల వేసి జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా నాగమణి రూ.పది వేల చెక్కును సునీల్‌కు ప్రోత్సాహక బహుమతిగా అందజేశారు. అనంతరం వక్తలు మాట్లాడుతూ భవిష్యత్తులో సునీల్ ఉన్నత స్థానానికి చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ ఉప్పిలి కనకరాజు, ఎంపీడీవో గుండాల అప్పలరాజు, పరిషత్ పర్యవేక్షకుడు కొల్లి వెంకటరావు, సునీల్ తల్లిదండ్రులు అప్పలరాజు, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

వెంకటేశ్వర కాలనీలోని సమస్యలను పరిష్కరించరూ..

అక్కిరెడ్డిపాలెం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ఇక్కడి వెంకటేశ్వర కాలనీలో రహదారులు, కాలువలను నిర్మించడంతో పాటు శ్మశానవాటిక సమస్యను పరిష్కరించి కాలనీని అభివృద్ధి చేయాలని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు. శ్మశానవాటిక లేకపోవడం వల్ల మృతి చెందిన వారికి అంత్యక్రియలు చేసేందుకు ఇబ్బందులు పడుతున్నామని, అలాగే రోడ్డు, కాలువలను నిర్మించాలని వేడుకున్నారు. పల్లాను కలిసిన వారిలో అసోసియేషన్ ప్రతినిధులు ఎ.వీర్రాజు, జి.పార్వతీశం, కె.మోహన్‌రావు, అలమండ రాజు, ఎ.శ్రీనివాసరావు, రాజారావు తదితరులు ఉన్నారు.

రూ.50 లక్షలు బొక్కేసిన ‘సౌకర్యం’ ఉద్యోగి

పన్నుల రూపంలో వసూలు చేసి సొంతానికి వాడుకున్న ఘనుడు

దర్యాప్తు నివేదిక వచ్చాక చర్యలు: వేపగుంట జడ్సీ హైమావతి

వేపగుంట, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ వేపగుంట జోనల్ కార్యాలయ పరిధిలో ఇంటి పన్నులు వసూలు చేసి సౌకర్యం కేంద్ర ఉద్యోగి సొంతానికి వాడుకున్న విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దీనిపై ప్రాథమిక విచారణ జరిపి సదరు ఉద్యోగిపై అధికారులు చర్యలు చేపట్టారు. వివరాలిలా ఉన్నాయి. ఇక్కడి సౌకర్యం కేంద్రంలో పన్నులు వసూలు చేసే ఉద్యోగి గత కొద్దిరోజులుగా ప్రజల నుంచి వసూలు చేసిన సొమ్మును జీవీఎంసీ బ్యాంక్ అకౌంట్‌కు జమ చేయకుండా సొంతానికి వాడుకున్నట్టు తేలింది. సాధారణంగా ఏ రోజు వసూలయ్యే నగదును అదే రోజు సాయంత్రం లేదా మర్నాడు ఉదయం బ్యాంకుకు జమ చేయాలి. అయితే ఇక్కడ పనిచేస్తున్న ఉద్యోగి పది రోజులకు పైగా వసూలు చేసిన సుమారు రూ.50 లక్షలను బ్యాంకుకు జమ కట్టలేదని అధికారులు గుర్తించారు. ఇందుకు కారణం ఎప్పటికప్పుడు పర్యవేక్షించే అధికారుల అలసత్వమా, లేకుంటే వారు కూడా సంబంధిత ఉద్యోగికి సహకారాన్ని అందించారా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం సదరు ఉద్యోగి నుంచి సుమారు రూ.10 లక్షల వరకు అధికారులు వసూలు చేసినట్టు తెలిసింది. మిగతా సొమ్మును కూడా రాబట్టేందుకు చర్యలు చేపడుతున్నారు. ఈ నేపథ్యంలో సంబంధిత ఉద్యోగిని వేరే విభాగానికి మార్చినట్టు జడ్సీ కె.హైమావతి గురువారం రాత్రి తెలిపారు. ఉద్యోగిపై విచారణకు ఆదేశించామని, దర్యాప్తు నివేదిక వచ్చిన వెంటనే జీవీఎంసీ కమిషనర్ ఆదేశాల మేరకు చర్యలు చేపట్టడం జరుగుతుందని పేర్కొన్నారు.

గ్రామాభివృద్ధికి మహిళలే కీలకం: జడ్పీ సీఈవో

పెందుర్తి, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): గ్రామాభివృద్ధికి మహిళలే కీలకమని, వనరులను ప్రణాళికాబద్ధంగా ఉపయోగించుకుని పంచాయతీల బలోపేతానికి మహిళా సర్పంచ్‌లు కృషి చేయాలని జడ్పీ సీఈవో నారాయణమూర్తి కోరారు. స్థానిక టీటీడీసీలో గురువారం రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో అనకాపల్లి, విశాఖ జిల్లాలకు చెందిన మహిళా సర్పంచ్‌లకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన శిక్షణ శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. అందరూ ప్రజలకు విద్య, వైద్యం, ఆరోగ్యం, సంక్షేమంపై దృష్టిసారించి గ్రామాలు ఆర్థిక ఆర్థిక పరిపుష్టి సాధించేలా ప్రణాళికలను సిద్ధం చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీపీవో శ్రీనివాసరావు, ఎంపీడీవో గుండాల అప్పలరాజు, తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా పోరాడాలి

మల్కాపురం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని జాతీయ సేవా పథకం జిల్లా ప్రోగ్రామ్ అధికారి ఈపీఎస్ భాగ్యలక్ష్మి కోరారు. స్థానిక సెయింట్ ఆన్స్ కళాశాలలో జాతీయ సేవా పథకం, ఈగల్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన అంతర్జాతీయ మత్తు పదార్థాల అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవంలో ఆమె పాల్గొని మాట్లాడారు. స్నేహితుల ఒత్తిడి వల్ల, మానసిక సమస్యల వల్ల యువత మత్తు పదార్థాలకు బానిసలుగా మారుతున్నారని పేర్కొన్నారు. దీనివల్ల అనేక అనారోగ్య సమస్యల బారిన యువత పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. మత్తు పదార్థాలను వినియోగించడం వల్ల భవిష్యత్తు నాశనమవుతుందని, ఆర్థి ఇబ్బందులకు గురై నేర ప్రవృత్తికి పాల్పడే ప్రమాదాలు ఉన్నాయని పేర్కొన్నారు. అందువల్ల అందరూ మత్తు వల్ల వాటిల్లే అనర్థాలకు దూరంగా ఉండాలన్నారు. ఆంగ్ల అధ్యాపకురాలు, ఈగల్ క్లబ్ కార్యదర్శి రోజా మాట్లాడుతూ మత్తు పదార్థాలకు పడినవారికి ప్రత్యేకంగా కౌన్సెలింగ్ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో జాతీయ సేవా పథకం అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు, క్లబ్ ప్రతినిధులు, వలంటీర్లు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ ప్రేమ, తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల వినియోగం ప్రాణాంతకం

పెదగంట్యాడ, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మాదకద్రవ్యాల వినియోగం ప్రాణాంతకమని జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆర్.ప్రసాదరావు అన్నారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల వినియోగం, మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవ కార్యక్రమాన్ని సృజన వెల్ఫేర్ అసోసియేషన్ గురువారం నడుపూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ మత్తు పదార్థాలు యువత బంగారు భవిష్యత్తును నాశనం చేస్తాయన్నారు. అందువల్ల అందరూ వీటికి దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎల్‌అండ్‌టీ సీఎస్ఆర్ ఇన్‌చార్జి యాద్విందర్‌సింగ్, పెందుర్తి ఐసీడీఎస్ సీడీపీఓ నీలవేణి, హెచ్‌ఎం రాచకొండ శ్రీనివాస్, సృజన వెల్ఫేర్ అసోసియేషన్ సీఈఓ హరనాథ్ మోహర్షీ, తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు ఉద్యోగి మృతికి కారణమైన పాము పట్టివేత

ఉక్కుటౌన్‌షిప్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): స్టీల్ ప్లాంట్ టౌన్‌షిప్‌లో ఉక్కు ఉద్యోగిని కాటేసి ఆయన మృతికి కారణమైన పామును స్నేక్ క్యాచర్ కిరణ్ గురువారం ఎంతో చాకచక్యంగా పట్టుకున్నారు. ఈ నెల 23న టౌన్‌షిప్ సెక్టార్-11లోని ఓ క్వార్టర్స్‌లో నిద్రిస్తున్న ఉద్యోగి టి.శ్రీనివాస్‌ను పాము కాటేయటంతో మృతి చెందిన సంగతి తెలిసిందే. దీంతో భయపడిపోయిన శ్రీనివాస్ కుటుంబ సభ్యులు అప్పటినుంచి ఇంట్లో కాకుండా స్థానికంగా వేరే ఇంట్లో ఉంటున్నారు. గురువారం ఉదయం స్నేక్ క్యాచర్ కిరణ్ క్వార్టర్స్ మొత్తం పరిశీలించి విద్యుత్ మీటరు బాక్సులో పాము ఉన్నట్లు గుర్తించి పట్టుకున్నారు. దీంతో కుటుంబ సభ్యులతో పాటు చుట్టుపక్కల నివాసం ఉంటున్న వారు ఊపిరి పీల్చుకున్నారు.



పాముతో స్నేక్ క్యాచర్ కిరణ్



కొత్తపాలెం అండర్ పాస్‌వే వద్ద వెలసిన ఆక్రమణలు

ఆక్రమణలపై సీఎం పేషీకి ఫిర్యాదు

గోపాలపట్నం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 89వ వార్డు పరిధి కొత్తపాలెం అండర్ పాస్‌వే కూడలిలోని రహదారి ఆక్రమణలను తొలగించాలని కోరుతూ ఇదే ప్రాంతానికి చెందిన డబ్బీరు శ్రీనివాసరావు అనే వ్యక్తి సీఎం పేషీకి ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు జీవీఎంసీ సిబ్బంది బుధవారం ఉదయం ఆక్రమణలను పరిశీలించి వెళ్లడం చర్చనీయాంశంగా మారింది. ఇక్కడి ఆక్రమణల్ని తొలగిస్తారా... లేదా? అనే అంశంపై స్థానికులు చర్చించుకుంటున్నారు.

ఇదీ సమస్య..

అండర్ పాస్‌వేకు ఆనుకుని ఉన్న స్థలంలో సుమారు పది దుకాణాలు ఉన్నాయి. వీటిలో ఒకటి, రెండు దుకాణాల్లో ఉన్నవారు చిరువ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. మిగిలిన దుకాణాలను స్థానికంగా ఉన్న కొందరు వ్యక్తులు ఏర్పాటు చేసి అద్దెకు ఇచ్చారు. కాగా సమీపంలోనే మద్యం షాపు ఉండటం వల్ల ఈ దుకాణాల వద్ద మందుబాబులు బహిరంగంగా మద్యం సేవించడం, గుంపులుగా ఉంటుండడంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. దీంతో ఈ దుకాణాల తొలగింపునకు చర్యలు చేపట్టాలని సీఎం పేషీకి శ్రీనివాసరావు ఫిర్యాదు చేశారు. ఇదిలావుండగా ఈ ప్రాంతంలో దుకాణాలు ఏర్పాటు చేసిన వారికి రాజకీయ నేతల అండదండలు ఉండడంతో జీవీఎంసీ అధికారులు కూడా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. అయితే సీఎం పేషీకే ఫిర్యాదు వెళ్లినందున అధికారులు ఆక్రమణలను తొలగిస్తారా, లేదా అన్న వేచిచూడాల్సి ఉంది.

శత శాతం ఉత్తీర్ణత సాధించాలి

సర్వశిక్షా అభియాన్ రాష్ట్ర పరిశీలకురాలు జయలక్ష్మి



విద్యార్థులకు సూచనలిస్తున్న జయలక్ష్మి

అక్కిరెడ్డిపాలెం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో చదువే విద్యార్థులందరూ శత శాతం ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేయాలని సర్వశిక్షా అభియాన్ రాష్ట్ర పరిశీలకురాలు జయలక్ష్మి అన్నారు. అక్కిరెడ్డిపాలెం హైస్కూల్‌ను గురువారం ఎస్ఎస్ఏ రాష్ట్ర పరిశీలక బృందం సందర్శించింది. ఈ సందర్భంగా విద్యార్థులకు సర్వేపల్లి రాధాకృష్ణ విద్యామిత్ర కిట్లను పరిశీలించి విద్యార్థుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులకు, ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఏ సభ్యులు దేముడుబాబు, హెచ్ఎం ఎంఎల్ఎస్ కాంతం, ఉపాధ్యాయులు కుమారస్వామి, మహ్మద్ ఇస్మాయిల్, రవిచంద్, నరసింహమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

మహిళకు ఆర్థిక సాయం అందజేత



మహిళకు నగదు అందజేస్తున్న నల్లూరు సూర్యనారాయణ

కూర్మన్నపాలెం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): భర్త మృతి చెందడంతో ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్న 86వ వార్డు పరిధి రాజీవ్ నగర్‌కు చెందిన దొమ్మేటి భాగ్యలక్ష్మికి గురువారం తెలుగుదేశం పార్టీ వార్డు అధ్యక్షుడు నల్లూరు సూర్యనారాయణ రూ.15 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఆమె ఇబ్బందులను ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు దృష్టికి తీసుకువెళ్లి పించన్ మంజూరుకు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు వేగుంట శ్రీనివాస్, జగదీశ్, నాగార్జున, సుబ్బయ్య, వెంకటేశ్, రమేశ్, గోవింద్ తదితరులు ఉన్నారు.

86వ వార్డు సమస్యలపై ‘పల్లా’కు వినతి

గాజువాక: జీవీఎంసీ 86వ వార్డులో పలు అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, ఇంకా కొన్ని సమస్యలు ఉన్నాయని, వాటిని పరిష్కరించాలని ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు గురువారం ఇక్కడి పార్టీ కార్యాలయంలో టీడీపీ వార్డు అధ్యక్షుడు నల్లూరు సూర్యనారాయణ వినతిపత్రం అందజేశారు. రోడ్లు నిర్మించాలని, డ్రైనేజీలకు మరమ్మతులు చేపట్టాలని కోరారు. పల్లాను కలిసిన వారిలో నాయకులు వేగుంట శ్రీనివాస్, నాగార్జున, వెంకటేశ్, రమేశ్, సుబ్బయ్య, రమణ, తదితరులు ఉన్నారు.

వారాహి మాతకు ప్రత్యేక పూజలు



వారాహి మాత సన్నిధిలో బొండా జగన్, కరణంరెడ్డి నరసింగరావు, తదితరులు

కూర్మన్నపాలెం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 87వ వార్డు పరిధి వడ్లపూడిలో వారాహి మాత నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అర్చకులు వాసుస్వామి, హరీష్‌శర్మల పర్యవేక్షణలో గురువారం విగ్రహ ప్రతిష్ఠ, ప్రత్యేక పూజలు, సామూహిక కంకుమ పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్, బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు, నాయకులు ఎస్ఎస్ విజయరామరాజు, రాజన్‌రాజు, లక్కరాజు సోంబాబు, జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

కూర్మన్నపాలెం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ప్రజల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్ అన్నారు. 87వ వార్డు లక్ష్మీపురంలో గురువారం రూ.60 లక్షలతో అభివృద్ధి కార్యక్రమాలకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను కల్పిస్తామన్నారు. సిద్ధార్థ నగర్‌లో స్పోర్ట్స్ స్టేడియానికి, ప్రధాన రహదారులు, గెడ్డల అభివృద్ధికి నిధులు మంజూరయ్యాయన్నారు. నాయకులు ఎస్ఎస్ విజయరామరాజు, లక్కరాజు సోంబాబు, ఎస్.కనక రాజు, రాజన్‌రాజు, ఎస్.పెంటారావు, బాబూరావు, రాంబాబు, దానయ్య, తదితరులు పాల్గొన్నారు.

సామాజిక భవన నిర్మాణానికి శంకుస్థాపన

గోపాలపట్నం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 89వ వార్డు పరిధి సంతోశ్ నగర్‌లో రూ.19 లక్షలతో నిర్మించనున్న సామాజిక భవన అదనపు అంతస్తు నిర్మాణ పనులకు కార్పొరేటర్ దాడి వెంకటరమేశ్ గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దశలవారీగా వార్డులో అభివృద్ధి పనులు చేపట్టి వార్డును ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానన్నారు. నాయకుడు విజయకుమార్, ఏఈ వెంకటలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

క్రైం... crime news

ఫుట్‌పాత్‌పై గుర్తు తెలియని మృతదేహం


గుర్తుతెలియని మృతదేహం

మల్కాపురం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మల్కాపురం పోలీసు స్టేషన్ పరిధి ఐఎన్ఎస్ సర్కార్ వద్ద ఫుట్‌పాత్‌పై గుర్తు తెలియని మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడికి సుమారు 50 ఏళ్ల వయసు ఉంటుందని పోలీసులు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. మృతుడు గులాబీ రంగు షర్ట్, నీలం రంగు లుంగీతో ఉన్నాడు. ఎవరైనా గుర్తిస్తే మల్కాపురం పోలీసు స్టేషన్ 0891-2577392 లేదా సీఐ 9440796023 నంబర్లకు ఫోన్‌చేసి సమాచారం ఇవ్వాలన్నారు.

1.6 కిలోల లిక్విడ్ గంజాయి పట్టివేత


స్వాధీనం చేసుకున్న లిక్విడ్ గంజాయి

పెందుర్తి, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): లిక్విడ్ గంజాయి తరలిస్తున్న నలుగురు నిందితులను సరిపల్లి ఫ్లైఓవర్ వద్ద గురువారం పెందుర్తి, టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. అల్లూరి జిల్లా పెదబయలుకు చెందిన గుల్లెలి చిన్నంనాయుడు, సోమశేఖర్, జెమిలి ప్రసాదరావు,మత్స్యలింగం రెండు ద్విచక్ర వాహనాలపై గంజాయితో వస్తున్నారన్న సమాచారంతో సరిపల్లి వద్ద పోలీసులు మాటువేశారు. నిందితుల బ్యాగులు తనిఖీ చేయగా 1.6 కిలోల లిక్విడ్ గంజాయి బయటపడింది. వారిని అరెస్టు చేసి, రూ.4 వేలు, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశామని సీఐ కేవీ సతీశ్‌కుమార్ తెలిపారు.

హత్యకేసులో నిందితుడి అరెస్టు

పెదగంట్యాడ, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): పెదగంట్యాడ ఆటోనగర్‌లో ఈ నెల 22న ఓ వ్యక్తిని హత్య చేసిన నిందితుడ్ని పోలీసులు గురువారం అరెస్టు చేశారు. న్యూపోర్టు పోలీస్‌స్టేషన్‌లో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో సౌత్ సర్కిల్ ఏసీపీ త్రినాథ్ కేసు వివరాలను వెల్లడించారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం జగదల్‌పూర్‌కు చెందిన మహదేవ్ బగేల్ (28), నరేష్ కశ్యప్ (30) మిత్రులు. రాడ్ బెండింగ్, డీ కాయిలింగ్ పని కోసం విశాఖ వచ్చారు. పెదగంట్యాడ పారిశ్రామికవాడ శ్రీకృష్ణ ఇంజినీరింగ్ యార్డులో పనికి కుదిరారు. ఈనెల 22న సాయంత్రం పెదగంట్యాడలో తాము ఉంటున్న షెడ్డులోనే మద్యం సేవిస్తూ ఘర్షణ పడ్డారు. తన సోదరి, తల్లిని మహదేవ్ బగేల్ తిట్టాడనే కోపంతో నరేష్ కశ్యప్ బగేల్‌ను రొట్టెల కర్రతో బలంగా కొట్టాడు. అది విరిగిపోవడంతో పక్కనే ఉన్న మరో కర్రతో కొట్టాడు. దీంతో మహదేవ్ మృతి చెందాడు. మృతదేహాన్ని కొంతదూరం ఈడ్చుకెళ్లి తుప్పల్లో పడేసి పరారయ్యాడు. బుధవారం సాయంత్రం విశాఖ రైల్వే స్టేషన్‌లో ఉన్నట్టు సమాచారం అందడంతో పోలీసులు అదుపులోకి తీసుకుని గురువారం అరెస్టు చేశారు. సమావేశంలో న్యూపోర్టు సీఐ టి.కామేశ్వరరావు, ఎస్ఐ శ్యామ్‌సుందర్ పాల్గొన్నారు.

90 డిఫెన్స్ మద్యం సీసాలు స్వాధీనం

విశాఖపట్నం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): డిఫెన్స్ మద్యం అక్రమంగా నిల్వ చేసి, విక్రయిస్తున్న ఇంటిపై ఎక్సైజ్ శాఖ అసిస్టెంట్ కమిషనర్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ గురువారం దాడిచేసింది. నిల్వ ఉంచిన 86 మద్యం సీసాలతో పాటు నాలుగు బీర్‌బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. సీఐ ఎస్. శ్రీనివాస్ తెలిపిన వివరాల మేరకు భీమిలి మండలం చినఉప్పాడ వద్ద ఎం.హేమంత్ ఐదు డిఫెన్స్ మద్యం సీసాలతో పట్టుబడ్డాడని, అతడిని విచారించగా, చినఉప్పాడలోని ఎల్లారావు అలియాస్ ఎల్లాజీ వద్ద కొనుగోలుచేసినట్టు చెప్పాడన్నారు. పోలీసులను చూసి ఎల్లాజీ పరారవగా, ఇంట్లో మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదుచేసి హేమంత్‌ను అరెస్టు చేశామని, ఎల్లాజీ కోసం గాలిస్తున్నామన్నారు. ఈ దాడిలో ఇన్‌స్పెక్టర్ సీహెచ్ రాజేశ్వరి, సిబ్బంది పాల్గొన్నారు.

రూ.1.04 కోట్ల విలువైన చోరీ సొత్తు రికవరీ


రికవరీ చేసిన సొత్తును పరిశీలిస్తున్న సీపీ శంఖబ్రతబాగ్చి

- 70 చోరీ కేసుల్లో 65 మంది నిందితుల అరెస్టు
- సీపీ శంఖబ్రత బాగ్చి

విశాఖపట్నం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): కమిషనరేట్ పరిధిలో గతనెలలో నమోదైన చోరీకేసుల్లో 70 కేసులను పోలీసులు ఛేదించి 65 మంది నిందితులను అరెస్టు చేసి, వారి నుంచి రూ.1,04,97,450 విలువైన సొత్తును రికవరీ చేశారు. పోలీస్‌బ్యారెక్స్‌లోని టెంపుల్ ఆఫ్‌లెర్నింగ్‌హాల్‌లో గురువారం జరిగిన 'క్రైమ్‌మేళా'లో రికవరీచేసిన సొత్తుని సీపీ శంఖబ్రత బాగ్చి బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. గతనెలలో 82 చోరీ కేసులు నమోదయ్యాయని, వాటిలో 70 కేసులను ఛేదించారన్నారు. చోరీలకు పాల్పడిన 65 మంది నిందితులను అరెస్టు చేసి, వారి నుంచి 1,044 గ్రాముల బంగారం, 6,066 గ్రాముల వెండి, రూ.9,06,900నగదు, 14 మోటార్‌సైకిళ్లు, 395 సెల్‌ఫోన్‌లు (15 చోరీకి గురైనవి, మిగిలినవి మిస్సింగ్) ఒక జేసీబీ, కారు, లాప్‌ట్యాప్‌తోపాటు సీసీ కెమెరాలకు సంబంధించిన సామగ్రి రికవరీచేశామన్నారు. వీటి విలువ రూ.1,04,97,450 వుంటుందన్నారు. చోరీల నియంత్రణలో భాగంగా గతనెలలో 610 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామని, 219 అవగాహన సమావేశాలు నిర్వహించామన్నారు. అనంతరం సొత్తుని పోగొట్టుకున్న బాధితులకు సీపీ వాటిని అందజేశారు. ఈ సమావేశంలో క్రైమ్ డీసీపీ లతామాధురి, ఏడీసీపీ మోహనరావు, ఏసీపీ లక్ష్మణరావు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ శ్రీభరత్



బీచ్‌రోడ్డులో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

- విశాఖ ఎంపీ మతుకుమిల్లి శ్రీభరత్
- బీచ్ రోడ్డులో భారీ ర్యాలీ

బీచ్ రోడ్డు, జూన్ 26, (ఆంధ్రజ్యోతి): యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఎంపీ మతుకుమిల్లి శ్రీభరత్ సూచించారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినం సందర్భంగా గురువారం ఆర్కే బీచ్ వద్ద ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మాదకద్రవ్యాలకు అలవాటుపడితే జీవితాలు నాశనమవుతాయన్నారు. చెడు వ్యసనాలకు బానిసై, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే జీవితమంతా జైళ్లలోనే మగ్గాల్సి ఉంటుందని హెచ్చరించారు. కలెక్టర్ హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ నగరాన్ని మాదకద్రవ్యాల రహితంగా తీర్చిదిద్దేందుకు ప్రజా సహకారం అవసరమన్నారు.నేటి యువత మత్తు పదార్థాలకు బానిసై జీవితాలను పాడు చేసుకోవడమే కాకుండా తల్లిదండ్రులకు తీరని వేదనను మిగులుస్తున్నారని, మాదకద్రవ్యాల వినియోగంతో సంభవించే మరణాల సంఖ్య నానాటికీ పెరుగుతుండడం ఆందోళనకు గురిచేస్తోందన్నారు. నగరంలో కొంతమంది యువత మత్తుపదార్థాలకు బానిలుగా మారి బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవడం చాలా బాధాకరమన్నారు. మత్తు పదార్థాల వినియోగంతో జరిగే నష్టాలపై పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు అవగాహన కల్పించే సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. నగరంలో మాదకద్రవ్యాలు, అక్రమ రవాణా అదుపు చేశామన్నారు. మాదకద్రవ్యాలను అరికట్టేందుకు స్వచ్ఛంద సంస్థలు సహకరించాలని కోరారు. అనంతరం ఆర్కే బీచ్ కాళికా మాత ఆలయం నుంచి వైఎంసీఏ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి, జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నగరాభివృద్ధి, సుందరీకరణపై దృష్టి సారించండి

అధికారులకు జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్ ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ కేతన్‌గార్గ్

వెంకోజీపాలెం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): నగరాభివృద్ధి, సుందరీకరణపై దృష్టి సారించాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్ అధికారులను ఆదేశించారు. ఇంజనీరింగ్ విభాగం పనులపై గురువారం ప్రధాన కార్యాలయంలో అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడుతూ నగరంలో జీవీఎంసీ ఇంజనీరింగ్ విభాగం, పర్యవేక్షక ఇంజనీర్ల పరిధిలో జోన్ల వారీగా చేపట్టిన పనులు, ఎంత మొత్తం ఖర్చు చేశారు, తదితర అంశాలపై పర్యవేక్షక ఇంజనీర్లతో సమీక్షించారు. అన్ని జోన్లలో చేపడుతున్న అభివృద్ధి పనులపై పూర్తిస్థాయి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. మధురవాడలో చేపట్టనున్న భూగర్భ మురుగు నీటి పారుదల వ్యవస్థకు సంబంధించిన ప్రాజెక్టు పనులపై ఇంటర్నేషనల్ ఫైనాన్స్ కార్పొరేషన్ ప్రతినిధులు, ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షించారు. అన్ని జోన్లలో చేపట్టిన బీటీ, సీసీ రోడ్లు, కాలువలు, తాగునీటి పైప్‌లైన్లు, వీధి దీపాల ఏర్పాటుకు భూగర్భ కేబుల్ పనులు, మెకానికల్, గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్, స్వీపింగ్ మెషీన్, విద్యుత్ దీపాల నిర్వహణ, భూగర్భ మురుగునీటి కాలువల పనులను పర్యవేక్షక ఇంజనీర్లు వివరించారు. ఒప్పందం మేరకు కాంట్రాక్టర్లు పనులను సకాలంలో పూర్తి చేసేలా చూడాలన్నారు. ఎయిర్‌పోర్టు నుంచి వీఐపీ రోడ్డు వరకు సెంటర్ మీడియన్‌లలో పచ్చదనం, పెయింటింగ్,రోడ్లపై జీబ్రా క్రాసింగ్, కూడళ్ల వద్ద పెయింటింగ్ పనులకు అంచనాలు తయారుచే యాలన్నారు. సమావేశంలో ఇంజనీర్లు గోవిందరావు, కేవీఎన్ రవి, పీవీవీ సత్యనారాయణరాజు, సంపత్‌కుమార్, కె.శ్రీనివాసరావు, వై.కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ ప్రాజెక్ట్‌లు సత్వరం పూర్తిచేయండి

- వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్


అధికారులతో సమావేశమైన వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్

విశాఖపట్నం, జూన్ 26(ఆంధ్రజ్యోతి): వీఎంఆర్‌డీఏ పరిధిలో జరుగుతున్న ప్రాజెక్ట్‌లన్నింటిని నిర్దేశిత గడువులోగా పూర్తిచేయాలని చైర్మన్ ప్రణవ్ గోపాల్ ఆదేశించారు. ఇంజనీరింగ్ అధికారులతో గురువారం సమావేశమయ్యారు. వీఎంఆర్‌డీఏ పార్కుల్లో వాకర్లకు ఇబ్బందులు లేకుండా చూడాలని, మౌలిక వసతులు కల్పించాలని సూచించారు. అవసరమైతే కొత్త ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. సెంట్రల్ పార్కులో యాంటీ డ్రగ్ పార్క్ నిర్మాణ పనులు ప్రారంభించాలన్నారు. ఎన్‌టీఆర్ లేఅవుట్లపై విస్తృత ప్రచారం చేయాలన్నారు. యోగాంధ్రాను విజయవంతం చేయడానికి పని చేసిన ప్రతి ఒక్కరిని అభినందించారు. ప్రజల నుంచి వచ్చేఫిర్యాదులను సత్వరం పరిష్కరించాలన్నారు. సమావేశంలో జాయింట్ కమిషనర్ కె.రమేశ్, సీఈ భవానీ శంకర్, ఈఈలు రామరాజు, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

లంకెలపాలెం ప్రమాదంలో మరో ఇద్దరి మృతి

- ఐదుకు చేరిన మరణాలు



అప్పలరాజు, రామ్‌కుమార్ (ఫైల్ ఫొటోలు)

లంకెలపాలెం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి లంకెలపాలెం కూడలి వద్ద ఇటీవల జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వారిలో మరో ఇద్దరు మృతిచెందారు. ప్రమాదం జరిగిన రోజున ముగ్గురు అక్కడికక్కడే ప్రాణాలు విడిచిన విషయం తెలిసిందే. ఈ నెల 23న రాత్రి విశాఖపట్నం పోర్టు నుంచి తెలంగాణ వెళుతున్న లారీ, లంకెలపాలెం జంక్షన్‌లో ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద ఆగి ఉన్న పలు వాహనాలపైకి దూసుకుపోయింది. ఈ ఘటనలో అనకాపల్లి మండలం రేబాకకు చెందిన పచ్చికూర గాంధీ, కొణతాల అచ్చియ్యయుడు, వై.ఎర్రప్పడు మృతిచెందారు. మరో 13 మందికి తీవ్రంగా, నలుగురికి స్వల్పగాయాలయ్యాయి. అనకాపల్లిలోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రాంబిల్లి మండలం జయరామపురం అగ్రహారం వీధికి చెందిన కంటైనర్ డ్రైవర్ రేఖ అప్పలరాజు (30) బుధవారం రాత్రి మృతి చెందాడని పోలీసులు తెలిపారు. కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న రావికమతం మండలం కొత్తకోటకు చెందిన సాలాపు రామ్‌కుమార్ (26) గురువారం మృతిచెందాడు. మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. పరవాడ డీఎస్పీ విష్ణుస్వరూప్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భీమిలిలో పర్యాటక స్థలాన్ని పరిశీలించిన రామ్‌దేవ్‌బాబా


కొత్తవలసలో పర్యాటక స్థలాన్ని పరిశీలిస్తున్న రామ్‌దేవ్‌బాబా

భీమునిపట్నం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : విశాఖపట్నం జిల్లాలోని పలు పర్యాటక స్థలాలను ప్రముఖ యోగా గురువు రామ్‌దేవ్ బాబా సందర్శిస్తున్నారు. ఈ క్రమంలో ఆయన గురువారం భీమిలి మండలం కొత్తవలసలో పర్యాటక శాఖకు చెందిన స్థలాన్ని సందర్శించారు. ఆయనకు భీమిలి ఆర్డీవో సంగీత్‌మాధుర్ కొత్తవలస స్థల స్వరూపాన్ని వివరించారు. అనంతరం ఆర్డీవో మాట్లాడుతూ రామ్‌దేవ్ బాబా విశాఖ రూరల్‌లో సన్ బీచ్ వద్ద కూడా పర్యాటక స్థలాన్ని పరిశీలించినట్టు తెలిపారు. ఆయనతో బాటు పర్యాటక శాఖాధికారులు ఉన్నారు.

ముగిసిన ఎంటీఎస్ టీచర్ల కౌన్సెలింగ్

విశాఖపట్నం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో సెకండరీ గ్రేడ్ టీచర్ల ఖాళీలను ఎంటీఎస్ టీచర్లతో భర్తీచేశారు. జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో మంగళవారం నుంచి చేపట్టిన కౌన్సెలింగ్ గురువారం రాత్రి 11 గంటలతో ముగిసింది. విశాఖ డీఈవో ఎన్.ప్రేమ్‌కుమార్ నేతృత్వంలో 426 మంది ఎంటీఎస్ టీచర్లకు కౌన్సెలింగ్ ద్వారా స్కూళ్లు కేటాయించారు.

'ప్రభుత్వ వంచనపై ఇంటింటి ప్రచారం'

విశాఖపట్నం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ వంచనపై ఇంటింటా ప్రచారం చేస్తామని మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. మద్దిలపాలెంలో మీడియాతో మాట్లాడారు. సూపర్‌సిక్స్ అమలు చేశామని గొప్పలు చెబుతున్నారన్నారు. యోగాంధ్ర పేరుతో రికార్డుల కోసం గిరిజనులకు సదుపాయాలు కల్పించక ఇబ్బంది పెట్టారన్నారు.



